ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV


Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in సంపుటి : 01 సంచిక : 88 శుక్రవారం 13 - 03 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad e - paper.vaarthasandhya.in VOLUME : 01 Issue : 88 Friday 13 - 03 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## 15 నుంచి ఒంటిపూట బడులు



- ఈ నెల 15 నుంచి కొత్త వేళలు
- వేసవి తాపం దృష్ట్యా తెలంగాణలో ఒంటిపూట బడుల నిర్వహణ
- ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు మారిన పనివేళలు
- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు తరగతులు
- పదో తరగతి ప్రత్యేక క్లాసులు యథాతథంగా కొనసాగింపు
- అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వర్తించనున్న నిబంధనలు




## ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్

- పార్టీ ఫిరాయింపు కేసును ముగించిన సుప్రీంకోర్టు
- తెలంగాణలో ఉత్కంఠ రేపిన పార్టీ ఫిరాయింపుల వ్యవహారం
- అన్ని పిటిషన్లను స్పీకర్ పరిష్కరించారన్న న్యాయవాది అభిషేక్ సింఘ్వీ
- స్పీకర్ నిర్ణయం నేపథ్యంలో విచారణ ముగిసిందని ప్రకటించిన సుప్రీంకోర్టు

## హైదరాబాద్‌కు హాలీవుడ్ వచ్చినట్లే

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- చిన్నప్పటి నుంచి నాకు సినిమాలంటే చాలా ఇష్టమన్న రేవంత్ రెడ్డి
- హైటెక్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ కార్యాలయాన్ని ప్రారంభించిన రేవంత్ రెడ్డి
- ఫ్యూచర్ సిటిలో నెట్‌ఫ్లిక్స్ కార్యాలయం పెట్టుకుంటామంటే స్థలం కేటాయిస్తామని ముఖ్యమంత్రి హామీ
- ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని భరోసా
- హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ రావడం అంటే సాక్షాత్తు హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్టే అన్న సీఎం
- నెట్‌ఫ్లిక్స్‌కు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని హామీ



**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 12 :** నెట్‌ఫ్లిక్స్ సంస్థను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. చాలా మంది ఇలాంటి స్టూడియో కోసం వెయిట్ చేస్తున్నారన్న ఆయన ప్రపంచవ్యాప్తంగా మంచి ప్రతిభను నెటిఫ్లిక్స్ వెలికితీస్తుందని కితాబిచ్చారు. హైదరాబాద్, నెట్‌ఫ్లిక్స్‌కు దగ్గరి పోలికలు ఉన్నాయని చెప్పారు. నెట్‌ఫ్లిక్స్ టాలెంట్ ఉన్న వాళ్లకు గొప్ప అవకాశాలు కల్పిస్తుందని, ఇప్పుడు గ్లోబల్ సిటీగా హైదరాబాద్ ఎదిగిందని అన్నారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, - మిగతా 2 లో

## గ్యాస్ బుకింగ్ వ్యవధిపై కేంద్రం కీలక నిర్ణయం

- గ్యాస్ బుకింగ్ వ్యవధిపై కేంద్రం కీలక నిర్ణయం
- ఇరాన్ యుద్ధంతో తీవ్రమైన వంటగ్యాస్ కొరత
- గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులకు పెరిగిన బుకింగ్ గ్యాప్
- పట్టణాల్లో కొనసాగనున్న పాత 25 రోజుల నిబంధన



## హిందూయేతరులకు నో ఎంట్రీ

- బద్రీనాథ్-కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ తీర్మానం
- బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా 47 గుడుల్లోకి హిందూయేతరులకు నో ఎంట్రీ
- త్వరలో ఉత్తరాఖండ్‌లో చార్‌ధామ్ యాత్ర ప్రారంభం
- ఈ క్రమంలో బద్రీనాథ్, కేదార్‌నాథ్ సహా 47 గుడుల్లోకి హిందువులకు మాత్రమే ప్రవేశం



**వార్త సంధ్య, ఢిల్లీ, మార్చి 12 :** మరికొద్ది రోజుల్లో చార్‌ధామ్ యాత్ర జరగనున్న వేళ ఉత్తరాఖండ్‌లో కీలక పరిణామం జరిగింది. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాల్లోకి ఇకపై హిందువులను మాత్రమే అనుమతించనున్నారు. ఈ ఆలయాల్లోకి హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధిస్తున్నట్లు బద్రీనాథ్-కేదార్‌నాథ్ టెంపుల్ కమిటీ (బీకేటీసీ) ప్రకటించింది. బద్రీనాథ్, కేదార్‌నాథ్ ఆలయాలతో పాటు కమిటీ పరిధిలోకి వచ్చే 47 దేవాలయాల్లోనూ ఇదే ఎంట్రీ నిబంధన వర్తిస్తుందని - మిగతా 2 లో

## నా ధైర్యం మీరే. నా బలం మీరే..

- వైసీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం.. జగన్ భావోద్వేగ ట్వీట్
- 2021 మార్చి 12న ఆవిర్భవించిన వైసీపీ
- తాడేపల్లిలోని కేంద్ర కార్యాలయంలో మిన్నంటిన వేడుకలు
- నల్లకాల్వలో ఇచ్చిన మాట కోసమే పార్టీ పుట్టిందన్న జగన్
- వైసీపీ అనేది కోట్లాది మంది ప్రజలు సొత్తు అని వ్యాఖ్య
- వైసీపీ అభిమాని కాలర్ ఎగిరేసేలా పార్టీ భవిష్యత్తు ఉంటుందన్న జగన్
- విలువలు, విశ్వసనీయతకు పార్టీ కట్టుబడి ఉంటుందన్న వైసీపీ అధినేత జగన్



**వార్త సంధ్య, అమరావతి, మార్చి 12 :** 2021 మార్చి 12న ఆవిర్భవించిన వైసీపీ... 15 ఏళ్లు పూర్తి చేసుకుని 16వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వేడుకలు మిన్నంటాయి. ఈరోజు జరిగిన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కార్యక్రమంలో పార్టీ అధినేత జగన్ వైసీపీ జెండాను ఆవిష్కరించి, కార్యకర్తలను ఉద్దేశించి ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. పార్టీ భవిష్యత్తుపై పూర్తి విశ్వాసాన్ని వ్యక్తపరిచారు.నల్లకాల్వలో ఇచ్చిన మాట కోసమే ఈ పార్టీ పుట్టిందని జగన్ గుర్తుచేశారు. తాను ఇచ్చిన ఆ ఒక్క మాట రాష్ట్ర రాజకీయాల దశను, దిశను మార్చివేసిందని ఆయన అన్నారు. 2011 మార్చి 12న పార్టీ ఆవిర్భవించిందని... వైసీపీ అనేది కోట్లాది మంది ప్రజల సొత్తు అని, - మిగతా 2 లో

## ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు

- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- వడగాలుల వల్ల ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు
- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో సీఎం చంద్రబాబు సమీక్ష
- వడదెబ్బ మరణాలు నివారించాలని స్పష్టమైన ఆదేశం
- వైద్యంలో ఏఐ, టెక్నాలజీ వినియోగాన్ని పెంచాలని సూచన
- 108 అంబులెన్సులు వేగంగా చేరేలా చర్యలు చేపట్టాలి
- ఉపాధి కూలీలు, పశువుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టీకరణ




**వార్త సంధ్య, అమరావతి, మార్చి 12 :** ఈసారి వేసవి తీవ్రత ఎక్కువగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. వడగాలుల కారణంగా రాష్ట్రంలో ఒక్క మరణం కూడా సంభవించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను గట్టిగా ఆదేశించారు. అమరావతిలో రెండో రోజు కొనసాగుతున్న 6వ జిల్లాల కలెక్టర్ల సదస్సులో ఆయన వైద్యారోగ్యం, వేసవి ప్రణాళికలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. ఎండలో పనిచేసే ఉపాధి హామీ కూలీల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పశువుల కోసం నిర్మించిన నీటి తొట్టెలను నిరంతరం నీటితో నింపాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలవుతున్న పశు బీమా పథకాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు.వైద్యారోగ్య రంగంపైనా సీఎం - మిగతా 2 లో

## మంత్రులకు రేటింగ్స్ ఇచ్చిన చంద్రబాబు

- తొలి స్థానంలో వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు
- హోం మంత్రి అనిత లాస్ట్!
- నాలుగో స్థానంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- మంత్రుల పనితీరుకు చంద్రబాబు రేటింగ్స్
- పాలనలో పారదర్శకత, వేగం పెంచడమే లక్ష్యంగా ఈ విశ్లేషణ
- ఫైళ్లను పెండింగ్‌లో ఉంచడం వల్ల పరిపాలన కుంటుపడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు



**వార్త సంధ్య, అమరావతి, మార్చి 12 :** ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో జరిగిన కలెక్టర్ల సదస్సు వేదికగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రుల పనితీరుపై నిర్వహించిన సమీక్ష రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. కేవలం మాటలతో కాకుండా, ఏ మంత్రి వద్ద ఫైళ్లు ఎంత వేగంగా క్లియర్ అవుతున్నాయనే అంశంపై సీఎం స్వయంగా 'గణాంకాలతో కూడిన రేటింగ్స్' ప్రకటించడం విశేషం. పాలనలో పారదర్శకత, వేగం పెంచడమే లక్ష్యంగా ఈ విశ్లేషణ సాగింది.ముఖ్యమంత్రి వెల్లడించిన నివేదిక ప్రకారం, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అందరికంటే వేగంగా ఫైళ్లను పరిష్కరిస్తూ మొదటి స్థానంలో నిలిచారు. ఆయన పనితీరుపై సీఎం ప్రశంసలు కురిపించారు. అచ్చెన్నాయుడు తర్వాత వరుసగా మంత్రులు నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉత్తమ రేటింగ్స్‌తో తర్వాతి స్థానాల్లో నిలిచారు. ఇక ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ జాబితాలో నాలుగో స్థానాన్ని దక్కించుకున్నారు.అయితే, కీలకమైన హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న వంగలపూడి అనిత ఫైళ్ల క్లియరెన్స్ విషయంలో అందరికంటే చివరి స్థానంలో నిలవడం గమనార్హం. ఫైళ్లను పెండింగ్‌లో ఉంచడం వల్ల పరిపాలన కుంటుపడుతుందని, నిర్ణీత సమయంలోగా నిర్ణయాలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఎం స్పష్టం చేశారు. మంత్రులందరూ - మిగతా 2 లో

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య



# సంపాదకీయం

## అనుచితమైన ఉచితాలెందుకు?!




ఇటీవల, జస్టిస్ సూర్యకాంత్ ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న సుప్రీంకోర్టు ధర్మాసనం ఉచిత పథకాల సంస్కృతిపై ధర్మాగ్రహాన్ని వ్యక్తం చేసింది. తమిళనాడులో ఉచిత విద్యుత్ పంపిణీ, రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు పలు వ్యాఖ్యలు చేసింది. పెద్ద పెద్ద భూస్వాములకు కూడా ఉచిత విద్యుత్తు అందించటంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. పేదలకు విద్య, కనీస అవసరాలు కల్పించటం ప్రభుత్వ బాధ్యత అని ప్రకటించింది. ప్రభుత్వాలు ఇచ్చే ఉచితాల వెనక ఉన్నది ప్రజల కష్టార్జితమైన పన్నుల సొమ్ము అని కూడా ధర్మాసనం గుర్తుచేసింది. ఒకవైపు రాష్ట్రాలు అప్పుల్లో ఉన్నప్పటికీ ఉచిత పథకాలు ఇవ్వటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించింది. సంక్షేమం పేరుతో ఆర్థిక క్రమశిక్షణను విస్మరిస్తే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించింది.తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ఫిబ్రవరి 13న ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రంలోని మహిళలకు రూ.5000నగదు బహుమానాన్ని ప్రకటించారు. 2023 నుంచి స్టాలిన్ ప్రభుత్వం రాష్ట్రంలోని 1.13 కోట్లమంది పేద మహిళలకు నెలకు రూ.1000 చొప్పున పెన్షన్ ఇస్తున్నది. అయితే ఇప్పుడు ఒక్కసారిగా రూ.5000 ఎందుకు ప్రకటించాల్సి వచ్చింది? తమిళనాడులో కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్న నేపథ్యంలో కేంద్రంలో మోదీ ప్రభుత్వం ఎప్పుడైనా ఎన్నికలు ప్రకటించవచ్చని, ఒకవేళ త్వరగా ప్రకటిస్తే మహిళలకు పెన్షన్ ఇవ్వటం సాధ్యం కాదని, మహిళలు ఇబ్బంది పడకుండా ఉండటానికి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలకు కలిపి రూ.3000, రాబోయే వేసవిలో ప్రత్యేక ఫండ్‌గా రూ.2000, మొత్తం కలిపి రూ.5000 ఇస్తున్నట్లు ప్రకటించారు. పెన్షన్ తీసుకునే మహిళల సంఖ్యను కూడా 1.31 కోట్లకు పెంచారు. అంతేగాక రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమను గెలిపిస్తే ఇప్పుడు మహిళలకు ఇస్తున్న పెన్షన్ వెయ్యి రూపాయలను రూ.2000లకు పెంచుతానని కూడా ప్రకటించారు. గత నెలలో ఏఐఏడీఎంకే జనరల్ సెక్రెటరీ పళనిస్వామి ఇలాంటి తాయిలాలనే అసెంబ్లీ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉండగా పురుషులకు కూడా ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పిస్తామని, కుటుంబంలోని మహిళా పెద్దకు నెలకు రూ.2000 ఇస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే, సుప్రీంకోర్టు పైన పేర్కొన్న తీవ్రవ్యాఖ్యలు చేసింది.నేడు కేంద్ర ప్రభుత్వం మొదలుకొని రాష్ట్ర ప్రభుత్వాల వరకు ఎన్నికల ముందు ప్రకటిస్తున్న ఉచిత పథకాలన్నీ ఓట్లు రాబట్టుకోవటానికేనన్నది బహిరంగ రహస్యం. అందుకే సుప్రీంకోర్టు హెచ్చరికపై కేంద్రం మొదలుకొని రాష్ట్ర ప్రభుత్వాల వరకు ఎటువంటి స్పందనా లేకుండా తేలు కుట్టిన దొంగల్లా ఉన్నాయి. సంక్షేమాన్ని, అభివృద్ధిని ప్రభుత్వాలు సమతూకంలో నడిపిస్తేనే అప్పుల ఊబిలో కూరుకుపోకుండా ఉంటాయని ఆర్థికవేత్తలు చెబుతూనే ఉన్నారు. కానీ వారి హెచ్చరికలు చెవిటివాని ముందు శంఖం ఊదినట్లుగానే మిగిలిపోతున్నాయి.దోపిడీశక్తులకు కొమ్ముగాసే పాలకులు ఉన్నంతకాలం పేదవర్గాలు సంక్షేమ పథకాలు పొందటాన్ని తమ హక్కుగానే భావిస్తాయి. ఆ హక్కుల సాధన కోసం పోరాడటానికి ఏమాత్రం వెనకాడవు. అయితే సుప్రీంకోర్టు ప్రశ్నించినట్టుగా భూస్వామ్య వర్గాలకు ఉచితాలు ఎందుకు? అలానే మహిళలకు ఉచిత బస్సు పథకం కూడా పోటీలు పడి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్నాయి. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ఎవ్వరూ డిమాండ్ చేయలేదు. జనాభాలో సగానికి పైగా ఉన్న మహిళల ఓట్లను దొడ్డిదారిన గుంజుకోవటానికి ఈ పథకాన్ని అత్యుత్సాహంతో అమలు చేస్తున్నారు. ఒకవేళ ఇవ్వదలిస్తే తెల్లకార్డు ఉన్న మహిళలకు అమలు చేయాలి. తద్వారా వారికి ఆర్థికంగా తోడ్పాటు ఇచ్చినట్లు అవుతుంది. ఓట్లు రాబట్టుకోవటమే పరమ ధ్యేయంగా సంక్షేమం అర్థాన్ని పాలకులు మార్చివేశారు. ఆఖరికి అడగకుండానే ఇచ్చే ఉచిత పథకాల వల్ల కష్టపడే వర్గాలు శ్రమకు దూరమవుతున్నాయి.రెండు తెలుగు రాష్ట్రాలలోని పాలకులూ చేసిన వాగ్దానాలను పూర్తిగా అమలుచేయలేక అయినకాడికి అప్పులు చేస్తూ ప్రభుత్వాలను సంక్షోభాల మధ్య నడుపుతున్నారు. ఈ రెండు రాష్ట్రాలలో ప్రతిపక్ష పార్టీల ప్రధాన కార్యక్రమం ఏమిటంటే, ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన ఉచిత పథకాలను అన్నింటినీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు కొనసాగించడమే! అంతేగానీ రాష్ట్రాలను అప్పుల సుడిగుండం నుంచి బయటవేసి అభివృద్ధి పథంలో కొనసాగించటానికి చేపట్టాల్సిన నిర్మాణాత్మక సూచనలు చేయాలన్న స్పృహ ఎవ్వరిలోనూ లేదు. ఇలాంటి స్థితిలో ప్రజలు తమ ప్రాథమిక హక్కు అయిన సంక్షేమ పథకాల అమలును డిమాండ్ చేస్తూనే సమాజంలో నానాటికి పెరుగుతున్న ఆర్థిక అంతరాలను తొలగించే సామాజిక వ్యవస్థ సాధన కోసం చేయి చేయి కలిపి సమైక్యశక్తిగా ముందడుగులు వేయాలి.

## ఒక్క మరణం కూడా జరగడానికి వీల్లేదు

**మొదటిపేజీ తరువాయి** – పలు కీలక సూచనలు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో వైద్య పరీక్షలు చేసే వ్యవస్థలను అందుబాటులోకి తేవడాన్ని అభినందించారు. తక్కువ ఖర్చుతో, సులభంగా తరలించగలిగే వైద్య పరికరాలను తయారు చేయాలని సూచించారు. మారుమూల ప్రాంతాలకు సైతం 108 అంబులెన్సులు వేగంగా చేరుకునేలా రూట్ ఆప్టిమైజేషన్ చేయాలని ఆదేశించారు. రియల్ టైమ్ గవర్నెన్స్ హబ్ (ఆర్టీఐహెచ్) ద్వారా మరిన్ని ఆవిష్కరణలు చేసి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు.

## మంత్రులకు రేటింగ్స్ ఇచ్చిన చంద్రబాబు

**మొదటిపేజీ తరువాయి** – తమ శాఖల్లో ఫైళ్ల కదలికపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రజలకు సేవలు అందించడంలో జాప్యం సహించబోమని ఆయన సుతిమెత్తగా హెచ్చరించారు.

## 10 మంది ఎమ్మెల్యేలకు బిగ్ రిలీఫ్

**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణలో సంచలనం సృష్టించిన ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ ముగిసింది. జస్టిస్ సంజయ్ కరోల్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించగా... స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే ఈ అంశంపై తుది నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తరపు న్యాయవాది కోర్టుకు వెల్లడించారు.ఫిరాయింపులపై దాఖలైన మొత్తం 10 పిటిషన్లను స్పీకర్ ఇప్పటికే పరిష్కరించారని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ ధర్మాసనానికి వివరించారు. సదరు 10 మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని స్పీకర్ తేల్చిచెప్పినట్లు ఆయన తెలిపారు. సింఘ్వీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం... స్పీకర్ ఇచ్చిన తీర్పు కాపీలను రెండు రోజుల్లోగా ఫిర్యాదుదారులకు అందజేయాలని ఆదేశించింది. స్పీకర్ తన నిర్ణయాన్ని వెలువరించిన నేపథ్యంలో, ఈ పిటిషన్లపై విచారణ ముగిసినట్లు సుప్రీంకోర్టు ప్రకటించింది.

## నగరాల్లో 25 రోజులు, గ్రామాల్లో 45 రోజులు




**మొదటిపేజీ తరువాయి** – దేశంలో నెలకొన్న వంటగ్యాస్ (ఎల్పీజీ) కొరతను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో గృహ వినియోగదారులకు ఎల్పీజీ సిలిండర్ రీఫిల్ బుకింగ్ మధ్య వ్యవధిని 45 రోజులకు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ, నగర ప్రాంతాల్లో మాత్రం 25 రోజుల నిబంధన కొనసాగుతుందని స్పష్టం చేసింది.ఇప్పటివరకు దేశవ్యాప్తంగా రెండు సిలిండర్ల బుకింగ్ మధ్య 25 రోజుల గ్యాప్ ఉండగా, ఇకపై ఈ నిబంధన కేవలం పట్టణ, నగర ప్రాంతాలకే పరిమితం కానుంది. గ్రామీణ ప్రాంతాల్లోని వినియోగదారులు మాత్రం ఒక సిలిండర్ బుక్ చేశాక, తదుపరి సిలిండర్ బుకింగ్ కోసం 45 రోజులు ఆగాల్సి ఉంటుంది.ఇరాన్ యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా ఎల్పీజీ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో దేశంలో గ్యాస్ కొరత తీవ్రమైంది. దీంతో చాలామంది వినియోగదారులు ముందుజాగ్రత్తగా సిలిండర్లను బ్లాక్‌లో నిల్వ చేసుకోవడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో హైదరాబాద్ సహా పలు నగరాల్లో హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి డిమాండ్ పెరగడంతో కమర్షియల్ సిలిండర్లను ఏజెన్సీలు రెట్టింపు ధరకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.కాగా, గ్రామీణ ప్రాంతాల్లో సరఫరా వ్యవస్థను క్రమబద్ధీకరించి, అందరికీ గ్యాస్ అందుబాటులో ఉంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం పేర్కొంది. గ్యాస్ ఉత్పత్తిని పెంచినప్పటికీ, డిమాండ్‌ను నియంత్రించే చర్యల్లో భాగంగానే ఈ కొత్త నిబంధనను అమల్లోకి తెచ్చినట్లు తెలుస్తోంది.

# నా ధైర్యం మీరే.. నా బలం మీరే.



**మొదటిపేజీ తరువాయి** – మొదటి నుంచి తాను కేవలం ప్రజలను, దేవుడిని మాత్రమే నమ్ముకున్నానని స్పష్టం చేశారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయతకు వైసీపీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందని చెప్పారు.వైసీపీ అభిమాని కాలర్ ఎగరేసేలా పార్టీ భవిష్యత్తు ఉంటుందని ఆయన కార్యకర్తల్లో ధైర్యం నింపారు. తనపై ప్రేమాభిమానాలు చూపిస్తున్న ప్రతి గుండెకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు అందజేశారు. మరోవైపు, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ వైఎస్సీపీ శ్రేణులు ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నాయి. 2011లో స్థాపించబడిన ఈ పార్టీ, 2019లో భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చి ఐదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే.మరోవైపు, ఎక్స్ వేదికగా కూడా ఆయన భావోద్వేగపూరితమైన పోస్ట్ పెట్టారు. “నా ధైర్యం మీరే.. నా బలం మీరే. నాన్న గారి ఆశయ సాధన కోసం స్థాపించిన మన పార్టీని, నన్ను మీరు గుండెల్లో పెట్టుకున్నారు, భుజాలపై మోస్తున్నారు. కష్టకాలంలో వెనక్కి తగ్గకుండా పార్టీ కోసం నిలబడుతున్నారు. పార్టీపై నమ్మకం పెట్టుకుని, నాపై నమ్మకం ఉంచి పార్టీ కోసం నిలిచిన మీరే మన పార్టీకి అసలైన బలం.. నా బలం. మన పార్టీ ప్రస్థానం కేవలం ఒక రాజకీయ ప్రయాణం మాత్రమే కాదు. ఒక లక్ష్యంతో లక్షలాది మంది కార్యకర్తల కష్టం, నమ్మకం, త్యాగాలకు నిలువెత్తు సాక్ష్యం. వైసీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు, అభిమానులు, నాయకులకు పేరు పేరునా శుభాకాంక్షలు“ అని ట్వీట్ చేశారు.

# హైదరాబాద్‌కు హాలీవుడ్ వచ్చినట్లే




**మొదటిపేజీ తరువాయి** – మంత్రి శ్రీధర్ బాబు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ దిల్ రాజు, తెలుగు అగ్రనటుడు రానాతో కలిసి ప్రారంభించారు. ఇందులో ఐలైన్ స్టూడియోస్ ప్రతినిధులు కూడా ఉన్నారు. నంబర్ వన్ బ్రాడ్‌కాస్టర్‌గా నెట్‌ఫ్లిక్స్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టిందని నెట్‌ఫ్లిక్స్ కూడా ఆ దిశగా దృష్టి పెట్టినట్లు ఒకసారి ఆర్టికల్ చదివానని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ భవిష్యత్తులో స్పోర్ట్స్ విభాగంలో నంబర్ వన్ బ్రాడ్‌కాస్టర్‌గా ఎదుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని భరోసాను ఇచ్చారు. సినిమాలపై తనకు ప్రత్యేక ఆసక్తి ఉందని, మూవీస్ చూడటం చాలా ఇష్టమని అన్నారు. ఫ్యూచర్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ కార్యాలయం పెట్టుకుంటామంటే స్థలం కేటాయిస్తామని, నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ కంపెనీని కూడా అక్కడ ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. ఇలాంటి స్టూడియో ఎంతగానో ఉపయోగపడుతుంది : హైదరాబాద్‌లో ఐలైన్ స్టూడియోను ప్రారంభించడం సంతోషంగా ఉందని ప్రముఖ నటుడు రానా అన్నారు. ఐలైన్ వంటి సంస్థ హైదరాబాద్‌కి రావడం ఇక్కడి సినిమాలు, అవి సాధించిన విజయాల గురించి చెప్పడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. నటులకు, దర్శకులకు, ప్రొడ్యూసర్లకు ఇలాంటి స్టూడియో భవిష్యత్తులో ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. బాహుబలి వల్ల వీఎఫ్ఎక్స్ అర్థమైంది : గతంలో పరిమితమైన ఆర్థిక వనరులతోనే అదీ కూడా చాలా తక్కువ మంది సినిమాలను నిర్మించేవాళ్లని రానా అన్నారు. ఇప్పుడు సినిమాల్లో సరికొత్తగా టెక్నాలజీ వినియోగం పెరగడం, ఐలైన్ వంటి స్టూడియోలు ఇక్కడికి రావడం మంచి పరిణామమని అభిప్రాయపడ్డారు. బాహుబలి వంటి సినిమాల కారణంగా వీఎఫ్ఎక్స్ ఎలా ఉంటుంది, అద్భుతాలు ఎలా చెయొచ్చో తెలుసుకున్నట్లు చెప్పారు. సహజంగా షూటింగ్ చేయడం యాక్టర్స్ చూస్తుంటారు, కానీ స్టూడియోలో క్రియేట్ చేసిన ప్రపంచంలో కూడా నటనను నేర్చుకుంటారన్నారు.“హైదరాబాద్ నగరం ముఖ్యంగా సినిమా చిత్ర పరిశ్రమ ఈ స్థాయిలో ప్రపంచాన్ని ఆకర్షిస్తోంది. సినిమా పరిశ్రమను ఆనాడు చెన్నై నుంచి ఇక్కడికి రావడానికి ఎన్టీఆర్, ఏఎన్నార్, రామానాయుడు స్టూడియోలు ఏర్పాటు చేయడంకో సాకారమైంది. ప్రపంచ స్థాయి టాలెంట్‌ను ఇక్కడ ప్రదర్శించడానికి అవకాశం కల్పించారు. ఈరోజు హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లే. ఇది నా కలకు ముందు అడుగుగా భావిస్తున్నాను. ఈ విషయాన్నే నా మిత్రులకు, ప్రజా ప్రతినిధులకు ఎన్నో సార్లు చెప్పి ఉంటా. ఇదేదో కేవలం టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్ కాదు. ప్రస్తుతం ఫోకస్ అంతా హాలీవుడ్ పైనే. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌లో ఉందని చెప్పడానికి నేను గర్వంగా ఫీలవుతున్నా. నేను అధికారికంగానే చెబుతున్న హాలీవుడ్ ఇక్కడ ఉంది. నా కల త్వరలోనే సాకారం కాబోతుంది. నెట్‌ఫ్లిక్స్‌ను, ఐలైన్ సీఈవో జెఫ్‌ను సంతోషంగా హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నా.సీఎం రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమంపై తాజాగా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. “ తెలంగాణకు నెట్‌ఫ్లిక్స్‌ను స్వాగతిస్తూ, సృజనాత్మకత, ఆవిష్కరణ, ప్రపంచ ఆకర్షించడానికి ఈ సహకారం ఉంటుంది. హైదరాబాద్, నెట్‌ఫ్లిక్స్ కలిసి ప్రపంచంలో ప్రతిభ, అవకాశాలు, సంస్కృతులను అనుసంధానించే ద్వారాలుగా పనిచేస్తాయి. అంతర్జాతీయ వినోదం, సృజనాత్మక పరిణామానికి అర్థవంతంగా దోహదపడతాయి“ అని రాసుకొచ్చారు.

# తెలంగాణలో ఒంటిపూట బడులు



**మొదటిపేజీ తరువాయి** – తెలంగాణలో పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల పనివేళల్లో మార్పులు చేసింది. ఈ నెల 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒంటిపూట బడులు (హాఫ్‌డే స్కూల్స్) నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు విద్యాశాఖ డైరెక్టర్ ఇ. నవీన్ నికోలస్ ఇవాళ ఉత్తర్వులు జారీ చేశారు.ఈ ఆదేశాల ప్రకారం ఈ నెల 15 నుంచి ఏప్రిల్ 23 వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు ఒంటిపూట విధానంలోనే నడుస్తాయి. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హైస్కూల్స్ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు మాత్రమే పనిచేస్తాయి. తరగతులు ముగిసిన వెంటనే మధ్యాహ్నం 12:30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తారు.అయితే, పదో తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు యథావిధిగా కొనసాగుతాయని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అలాగే, పదో తరగతి పరీక్షా కేంద్రాలుగా ఉన్న పాఠశాలలు పరీక్షలు జరిగే రోజుల్లో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది. మిగతా రోజుల్లో ఈ కేంద్రాలు కూడా సాధారణ హాఫ్‌డే టైమింగ్స్‌ను పాటిస్తాయి.

# 47 గుడుల్లోకి హిందూయేతరులకు నో ఎంట్రీ



**మొదటిపేజీ తరువాయి** – వెల్లడించింది.2026 జనవరిలో ఉత్తరాఖండ్‌లోని గంగా సభ ‘హర్ కీ పౌడీ‘ ఘాట్‌కు హిందువులు కాని వారి ప్రవేశాన్ని నిషేధించాలని డిమాండ్ చేసింది. ఈ క్రమంలో ‘హర్ కీ పౌడీ‘ ఘాట్‌లోని పలుచోట్ల హిందూయేతరులకు ప్రవేశం లేదని బోర్డులు కూడా పెట్టింది. దీంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాత చార్‌ధామ్‌లోకి హిందువులు కాని వారిని అనుమతించకూడదని డిమాండ్లు వచ్చాయి. ఈ నేపథ్యంలో బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ ఛైర్మన్ హేమంత్ ద్వివేది ఈ ఏడాది జనవరిలో కీలక ప్రకటన చేశారు. బీకేటీసీ పరిధిలో ఉన్న దేవాలయాలలో హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధించే తీర్మానాన్ని ఆమోదిస్తామని అన్నారు.

**బడ్జెట్ సమావేశంలో నిర్ణయం**

మార్చి 10న డెహ్రాడూన్‌లోని బీకేటీసీ క్యాంప్ కార్యాలయంలో బడ్జెట్ సమావేశం జరిగింది. బీకేటీసీ అధ్యక్షుడు హేమంత్ ద్వివేది అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాబోయే 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ.121.7 కోట్ల బడ్జెట్‌ను ఆమోదించారు. అలాగే బీకేటీసీ పరిధిలోని బద్రీనాథ్, కేదార్‌నాథ్‌తో సహా 47 దేవాలయాల్లోకి హిందూయేతరుల ప్రవేశాన్ని నిషేధిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమే : అసదుద్దీన్ ఓవైసీ**

ఈ నిర్ణయంపై ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ స్పందించారు. హరిద్వార్‌లో హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధిస్తూ పోస్టర్లు వేయడం రాజ్యాంగాన్ని అపహాస్యం చేయడమేనని ఓవైసీ అన్నారు. ఇది అంటరానితనం, సమానత్వ హక్కును ప్రత్యక్షంగా ఉల్లంఘించడమేనని అభిప్రాయపడ్డారు. అటువంటి భావజాలాన్ని కలిగి ఉండటం అంటే చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు.మరోవైపు, ఇటువంటి ఆంక్షలు సమాజంలో విభజనను తీవ్రతరం చేస్తాయని జమియత్ ఉలేమా-ఎ-హింద్ అధ్యక్షుడు అర్షద్ మదానీ తెలిపారు. ఇది భారతదేశ సంస్కృతి, పరస్పర గౌరవ స్ఫూర్తికి విరుద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు.ఆలయాల్లోకి హిందూయేతరుల ప్రవేశంపై నిషేధం విధించడాన్ని ఆల్ ఇండియా ఇమామ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఇమామ్ డాక్టర్ ఇమామ్ ఉమర్ అహ్మద్ సమర్థించారు. ఇది మతానికి సంబంధించిన విషయమని అన్నారు. హిందూయేతరులు గుడిలోకి ప్రవేశించకూడదని ఆలయ కమిటీ నిర్ణయిస్తే, ఎవరూ అభ్యంతరం చెప్పకూడదని పేర్కొన్నారు. మక్కా, మదీనాలో ముస్లిమేతరులకు అనుమతి లేదని, దానికి ఎవరూ అభ్యంతరం చెప్పలేదని గుర్తు చేసుకున్నారు. ఇలాంటి మతపరమైన విషయాల్లో రాజకీయాలు ఉండకూడదని అభిప్రాయపడ్డారు.

**సీఎం ఏమన్నారంటే?**

అయితే బీకేటీసీ తీసుకున్న నిర్ణయంపై ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ స్పందించారు. మతపరమైన ప్రదేశాలను నిర్వహించే సంస్థలు, వ్యక్తులతో సంప్రదించిన తర్వాత ఈ విషయంపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని మతపరమైన, పవిత్ర స్థలాలను తీర్థ సభ, గంగా సభ, కేదార్ సభ, బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ, పూజ్య సంత్ సమాజ్ నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. అందువల్ల ప్రభుత్వం వారందరి అభిప్రాయాలు ఆధారంగా ముందుకు సాగుతుందని వెల్లడించారు.

**‘రాజ్యాంగం ప్రకారం ఈ నిర్ణయం‘**

హిందూ మతం, సనాతన ధర్మాన్ని పాటించేవారిని కేదార్‌నాథ్, బద్రీనాథ్‌కు స్వాగతిస్తున్నామని బీకేటీసీ అధ్యక్షుడు హేమంత్ ద్వివేది తెలిపారు. అయితే సనాతన ధర్మాన్ని పాటించని వారు ఆలయంలోకి ప్రవేశించాన్ని పూర్తిగా నిషేధించామని చెప్పారు. రాజ్యాంగం ప్రకారమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సనాతన ధర్మం, హిందూ మత ప్రదేశాలు దేశానికి ఆత్మలాంటివని అభిప్రాయపడ్డారు.

**ఏప్రిల్ 19న చార్‌ధామ్ యాత్ర ప్రారంభం**

చార్‌ధామ్ యాత్ర ఈ ఏడాది ఏప్రిల్ 19న ప్రారంభం కానుంది. ఆ రోజున గంగోత్రి, యమునోత్రి ఆలయాలను తెరుస్తారు. యాత్రికుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ మార్చి 6న ప్రారంభమైంది. చార్‌ధామ్ యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఉత్తరాఖండ్ ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

# హర్మూజ్ జలసంధి నుంచి సేఫ్ గా ముంబై చేరుకున్న ముడిచమురు నౌక


**మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నడుమ సౌదీ క్రూడ్ ఆయిల్‌తో భారత్ చేరిన నౌక**

**లిబీరియా జెండాతో ఉన్న షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్ నౌక ముంబై పోర్టుకు రాక**

**ఇరాన్ పర్యవేక్షణలో కీలకమైన హోర్ముజ్ జలసంధిని దాటిన ట్యాంకర్**

**పరిస్థితిని నిశితంగా గమనిస్తున్న భారత షిప్పింగ్ మంత్రిత్వ శాఖ**

**ఇరాన్ అనుమతి లేని నౌకలను జలసంధిలో నిలిపివేస్తామని ఆ దేశ కమాండర్ హెచ్చరిక**




మధ్యప్రాచ్యంలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా సౌదీ అరేబియా నుంచి ముడి చమురుతో బయలుదేరిన ‘షెన్‌లాంగ్ సూయెజ్‌మాక్స్‘ నౌక సురక్షితంగా భారత్‌కు చేరుకుంది. లిబీరియా జెండాతో, భారత కెప్టెన్ సారథ్యంలో ప్రయాణించిన ఈ ట్యాంకర్ బుధవారం ముంబై పోర్టుకు చేరినట్లు ముంబై పోర్ట్ ట్రస్ట్ వర్గాలు ధృవీకరించాయి. ఏఎన్ఐ వార్తా సంస్థ ఈ వివరాలను వెల్లడించింది.సౌదీ అరేబియాలోని రాస్ తనూరా పోర్టు నుంచి మార్చి 1న బయలుదేరిన ఈ నౌక, ఇరాన్ అధికారుల అనుమతితో హోర్ముజ్ జలసంధిని దాటింది. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్రమైన ఘర్షణ వాతావరణం కారణంగా ఈ ప్రాంతంలో నౌకల రద్దీ గణనీయంగా పడిపోయింది. ఈ నేపథ్యంలో ఇరాన్ ఇటీవల హోర్ముజ్ జలసంధిపై తన పట్టును మరింత బిగించింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ నేవీ కమాండర్ అలీరెజా తంగ్సిరి ఇటీవల చేసిన హెచ్చరిక అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. “హోర్ముజ్ జలసంధిలో సురక్షిత ప్రయాణం సాధ్యమా? ఇరాన్ హెచ్చరికలను పెడచెవిన పెట్టి వెళ్లాలనుకున్న ఎక్స్‌ప్రెస్ రోమ్, మయూరీ నారీ నౌకల సిబ్బందిని అడగండి. వాటిని మేము స్వాధీనం చేసుకున్నాం. ఇరాన్ అనుమతి లేకుండా ఏ నౌక ముందుకు వెళ్లలేదు“ అని ఆయన ఎక్స్ వేదికగా స్పష్టం చేశారు.అమెరికా, ఇజ్రాయెల్ ప్రయోజనాలకు మద్దతు పలకని దేశాల నౌకలకు మాత్రమే జలసంధి గుండా సురక్షిత మార్గాన్ని కల్పిస్తామని ఇరాన్ అధికారిక మీడియా ప్రకటించింది. ఈ క్రమంలో భారత జెండా ఉన్న నౌకలకు ఇరాన్ సురక్షిత మార్గాన్ని అందిస్తోంది. ఇరాన్-ఒమన్ దేశాల మధ్య ఉన్న ఈ జలసంధి ప్రపంచంలోనే అత్యంత కీలకమైన సముద్ర మార్గాలలో ఒకటి. ప్రపంచ చమురు వినియోగంలో ఐదో వంతు, అంటే రోజుకు దాదాపు 2 కోట్ల బ్యారెళ్ల ముడి చమురు ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది.ఈ పరిణామాల నేపథ్యంలో భారత పోర్టులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ అప్రమత్తమైంది. ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లో 28 భారత జెండా కలిగిన నౌకలు ఉన్నాయని, వాటిలో 677 మంది భారత సిబ్బందితో కూడిన 24 నౌకలు హోర్ముజ్ జలసంధికి పశ్చిమాన, 101 మంది సిబ్బందితో ఉన్న 4 నౌకలు తూర్పున ఉన్నాయని తెలిపింది. ఫిబ్రవరి 28 నుంచి మంత్రిత్వ శాఖలో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, రాయబార కార్యాలయాలు, షిప్ మేనేజర్లతో కలిసి పరిస్థితిని సమీక్షిస్తున్నట్లు ప్రకటించింది. మధ్యప్రాచ్య సంక్షోభం తీవ్రమవుతున్న తరుణంలో, భారత ఇంధన భద్రతకు అవసరమైన ముడి చమురు దిగుమతులను నిరంతరాయంగా కొనసాగించడంలో ఈ నౌక విజయవంతమైన ప్రయాణం ఒక కీలక ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

వార్త సంధ్య vaartha sandhya తెలుగు దిన పత్రిక RNI TGTEL/25/A5065



## ఇంటర్ మొదటి సంవత్సర పదకొండవ రోజు పరీక్ష ప్రశాంతం..

### ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన

### ఇంటర్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ / కామర్స్/ పరీక్షకు 96% మంది విద్యార్థులు హాజరు

**పెద్దపల్లి, జిల్లా ప్రతినిధి, మార్చి12( వార్త సంధ్య) :** పెద్దపల్లి జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు పదకొండవ రోజు గురువారం ప్రశాంతంగా జరిగాయని ఇంటర్మీడియట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు. పదకొండవ రోజు ఇంటర్ మొదటి సంవత్సరం కెమిస్ట్రీ / కామర్స్ భాష పరీక్షలు జరిగాయని, ఈ పరీక్షకు 4999 మంది హాజరు కావాల్సి ఉండగా, 4845 మంది హాజరు కాగా,154 మంది విద్యార్థులు గైర్హాజరు అయ్యారని,96 శాతం హాజరు నమోదు కావడం జరిగిందని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగ వ్యాపారులతో సమావేశం...




**పెద్దపల్లి, మంథని, మార్చి 12 (వార్త సంధ్య) :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగ గురువారం పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చిందం మహేష్ అధ్యక్షతన సెంటినరీ కాలనీ వ్యాపారస్తులతో మాంసం విక్రయ ధరలు మరియు దుకాణ దారులతో సమావేశం ఏర్పాటు చేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రామగిరి ఎంపిడిఓ బద్రి శైలజరాణి , ఆర్ డబ్ల్యు ఎస్ డిఈ రాజ్ కుమార్ హాజరై ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల పై మరియు పథకాలపై అవగాహన కల్పించారు. షాప్ కాంప్లెక్స్ రోడ్డు వెంబడి ఎవరి దుకాణం ముందు వారు శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. లేని యెడల ఎవరైతే చెత్త రోడ్డు బయట వేస్తున్నారో వారికి 500 నుండి 1000 జరిమాన విధించడం జరుగుతుందని అన్నారు. అనంతరం కేజీబీవీ పాఠశాలను సర్పంచ్ తో కలిసి సందర్శించారు. విద్యార్థిని ల మంచి చెడులు అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులకు జరగబోయే పరీక్షలపై ఎలాంటి ఒత్తిడి లేకుండా వ్రాయాలని తగు సూచనలు అందించారు మరియు కిచెన్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చేతి సుధాకర్ , తాండ్ర ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి భూక్యా ప్రేమలత, పాఠశాల ఎస్ఓ మంజుల, ఏఎన్ఎం శారద, అంగన్వాడీ టీచర్ లు రాజ్యలక్ష్మి ,మంజుల,ఆశా వర్కర్ శిరీష , వ్యాపారవేత్తలు అధ్యక్షుడు ఆకుల నారాయణ, ఓర్రె మస్తాన్, సంపత్ రెడ్డి, రమేష్, హైమద్, పెయ్యాల రవి ,గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల కళాకారుల సమస్యలు పరిష్కరించండి కిరణ్



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య ) మార్చి 12 :** హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు టైగర్ ఆర్. కృష్ణన్న తో బీసీ కళామండలి జాతీయ అధ్యక్షులు శిరసనవాడ రామలింగన్న ఇప్పుడే ఫోన్‌లో మాట్లాడటం జరిగింది. ప్రస్తుతం కృష్ణన్న ఢిల్లీలో పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొంటున్నారు. ఈరోజు ఆయనకు ప్రధానమంత్రి తో సుమారు ఒక గంట పాటు సమావేశం జరగడం జరిగింది. పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం సీఎం అపాయింట్మెంట్‌లో కొంత ఆలస్యం అవుతుందని తెలిపారు. అయితే దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరంగా భావించవద్దని, తాను తెలంగాణకు వచ్చిన వెంటనే సీఎం అపాయింట్మెంట్ ఏర్పాటు చేసి కల్పిస్తానని కృష్ణన్న మాట ఇవ్వడం జరిగింది. నకిరేకంటి కిరణ్ కుమార్ తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

## మనోహర్ బాబుకు ఘన నివాళి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చ్ 12 :** వీర్ నగర్ కమిటీ హాల్ లో మనోహర్ బాబు చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు హఠాత్ మరణం సందర్భంగా సమస్యలు సభ పెట్టడం జరిగింది వీర్ నగర్ చింతల్ బస్తి నాంపల్లి కాన్స్టిట్యూఎన్సీ ఇక్కడున్న పెద్దలు మరియు మనోహర్ బాబు దగ్గర ఉన్నటువంటి ఉన్న మిత్రులు అందరూ కలిసి ఈ యొక్క సమాస్మరణ సభ పెట్టడం జరిగింది బస్తివాసులు అందరూ రావడం జరిగింది మరి మనోహర్ బాబు గురించి మరణ వార్త తీయగానే అందరూ షాక్కు గురి కావడం మరి మనోహర్ బాబు గురించి ఆయన ఒక మంచి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మరి మూడు దశాబ్దాల నుండి కాంగ్రెస్ పార్టీలో ఉండి మంచి కార్యక్రమాలు చేస్తూ మరి దసరా సమ్మేళనం గురించి మరి హనుమాన్ జయంతి మరి ప్రతి పండుగలను హిందూ ముస్లిం అని తేడా లేకుండా అందర్నీ కలిసి మెలిసి పండగలు చేసే నాయకుడు మనోహర్ బాబు గారు మరి ఇలాంటి సందర్భంలో ఆయన లేకపోవడం చాలా బాధాకరం మరి ఎమ్మెస్ ప్రభాకర్ రావు మాజీ ఎమ్మెల్సీ ఈ కార్యక్రమానికి వచ్చి మనోహర్ బాబు గారి యొక్క చిత్రపటానికి పూలు వేసి ఆయన శాంతి కు దేవునితో ప్రార్థించాలని కోరడం జరిగింది మరి సభను ప్రారంభించి మనోహర్ బాబు కు అన్ని విధాలుగా వాళ్ళ కుటుంబానికి మరి సానుభూతిగా ఆదుకుంటామని చెప్పడం జరిగింది మరి ప్రతి ఒక్కరూ బస్తీవాసులు ఆయన గురించి ప్రతి ఒక్కరు ఆయన చేసిన మంచి పనులకు గుర్తు చేస్తూ మరి ఈ సభను ముగించడం జరిగింది సయ్యద్ ఫసి హుసేన్ రాష్ట్ర కార్య దర్శి ఈ కార్యక్రమంలో బత్తుల శ్రీనివాస్ టీంకు గట్టయ్య వినోద్ కుమార్ పునీత్ అనిల్ రాజన్న నాగేష్ భగవాన్ వెంకటేష్ రామచందర్ విద్యాసాగర్ సుధీర్ కుమార్ విజయకుమార్ అమర్నాథ్ వెంకటేష్ ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

## తెలంగాణా ఉద్యమకారుల కోసం చట్టబద్ధ కమిటీ వేయాలి ఉద్యమ సంఘాల డిమాండ్



**హైదరాబాద్ ప్రతినిధి మార్చి12(వార్త సంధ్య ) :** తెలంగాణా ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చట్టబద్ధమైన కమిటీని ఏర్పాటు చేయాలని తెలంగాణా ఉద్యమ సంఘాల సమన్వయ వేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ కమిటీకి 6 నెలల కాలపరిమితి నిర్ణయించాలని వారు కోరారు. గురువారం హైదరాబాద్‌లోని భాషిర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణా ఉద్యమ సంఘాల సమన్వయ వేదిక ఆధ్వర్యంలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా టి యూ



జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామ్ రెడ్డి, టియూఫ్ జానకి రెడ్డి, ఓరుగంటి ఆనంద్, సుల్తాన్ యాదగిరి, సికింద్ర బేగం, అనిల్ కుమార్, సుజి, కొమురయ్య తదితరులు మాట్లాడారు. వారు మాట్లాడుతూ తెలంగాణా రాష్ట్ర సాధనలో ఉద్యమకారుల త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. ఉద్యమ సమయంలో ఎన్నో కష్టాలు పడుతూ, కేసులు ఎదుర్కొని, జైలు జీవితం అనుభవించిన పలువురు ఉద్యమకారులు ప్రస్తుతం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. అలాంటి వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. అలాగే ఉద్యమకారుల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, 250 గజాల స్థలం, హెల్త్ కార్డు వంటి సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా తెలంగాణా అమరవీరుల కుటుంబాలను కూడా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మోహన్ బైరాగి, లారా, గోశిక రవి, యాదగిరి, హరి, సుచరిత తదితరులు పాల్గొన్నారు.

# దేశ ఇంధన భద్రతకు ఢోకా లేదు- కిషన్‌రెడ్డి

### - పశ్చిమాసియా సంక్షోభంపై విపక్షాలది బాధ్యతారాహిత్యం



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి(వార్త సంధ్య) మార్చి 12 :** పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణాన్ని సాకుగా చూపి దేశంలో కృత్రిమ ఇంధన కొరత సృష్టించేందుకు విపక్షాలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నాయని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ పటిష్ట నాయకత్వంలో దేశ ఇంధన భద్రత సురక్షితంగా ఉందని, ప్రజలు ఎలాంటి వదంతులను నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు. దేశ ప్రజలకు, రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం పక్కా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిందని భరోసా ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వ హయాంలో దేశ ఆర్థిక వ్యవస్థ 'ఫ్రాజైల్-5' (బలహీన ఆర్థిక స్థితి) కి దిగజారిందని మంత్రి విమర్శించారు. "నాడు ఇంధన పొదుపు పేరుతో రాత్రి 8 గంటల తర్వాత పెట్రోల్ బంకులు మూసివేయాలని ఉచిత సలహాలు ఇచ్చిన వారే, నేడు బ్లాక్ మార్కెట్ దందాను ప్రోత్సహించేలా భయభ్రాంతులు సృష్టిస్తున్నారని అన్నారు. 2012-13లో ఇరాన్‌పై ఆంక్షల వల్ల ముడిచమురు దిగుమతులు 26.5 శాతం పడిపోయినా, యూపీఏ ప్రభుత్వం ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా చేతులెత్తేసిందని కానీ మోదీ ప్రభుత్వం అలా కాదు" అని ఆయన మండిపడ్డారు. సంక్షోభ సమయంలోనూ దేశంలోని 140 కోట్ల మందికి ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టామని కిషన్‌రెడ్డి వివరించారు. గతంలో 27 దేశాలపైనే ఆధారపడిన మనం, నేడు 40 దేశాల నుంచి ముడిచమురును దిగుమతి చేసుకుంటున్నామన్నారు. విశాఖపట్నం, మంగళూరు, పదూర్ ప్రాంతాల్లోని భూగర్భ కేంద్రాల్లో దాదాపు 74 రోజులకు సరిపడా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. వివిధ దేశాల ముడి చమురును శుద్ధి చేసేలా రిఫైనరీలను ఆధునికీకరించి, ప్రపంచంలోనే 4వ అతిపెద్ద రిఫైనింగ్ దేశంగా, 5వ అతిపెద్ద ఎగుమతిదారుగా భారత్ అవతరించిందని తెలిపారు. గల్ఫ్ దేశాల్లోని 90 లక్షల మంది భారతీయుల భద్రతే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని మంత్రి స్పష్టం చేశారు. వాణిజ్య నౌకలపై దాడులను ఉపేక్షించేది లేదని, 'జీరో టోలరెన్స్'తో ముందుకెళ్తున్నామని తెలిపారు. హోర్ముజ్ జలసంధిని భారత్ కోసం తెరిచే ఉంచుతామని, భారత జెండా ఉన్న నౌకలను ఆపబోమని ఇరాన్ స్పష్టం చేయడం మోదీ ప్రభుత్వ దౌత్య విజయానికి నిదర్శనమన్నారు. గృహ వినియోగదారులకు ఎల్పీజీ సరఫరాలో అంతరాయం కలగకుండా రిఫైనరీలు అదనంగా 25 శాతం ఉత్పత్తిని పెంచాయని కిషన్‌రెడ్డి తెలిపారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో అంతర్జాతీయంగా ఎరువుల ధరలు పెరిగినా ఆ భారాన్ని రైతులపై పడనీయలేదని గుర్తుచేశారు. ప్రస్తుత పరిస్థితుల్లోనూ రైతులకు సకాలంలో ఎరువులు అందేలా అన్ని చర్యలు తీసుకున్నామని ఆయన హామీ ఇచ్చారు. అవకాశవాద శక్తుల కుట్రలను తిప్పికొట్టి, ప్రభుత్వానికి అండగా నిలవాలని ప్రజలను కోరారు.

# పిల్లల భద్రతపై అప్రమత్తత అవసరం

### డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తుకు ముప్పు

### పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి




**పెద్దపల్లి జిల్లా ప్రతినిది, మార్చి 12 (వార్త సంధ్య ) :**అంతర్గాం మండలంలో పిల్లల భద్రత, డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ పరిధిలోని అంతర్గాం పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో, అంతర్గాం మండల కేంద్రంలో "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం భాగంగా గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్ పర్యవేక్షణలో, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకట్ ఆధ్వర్యంలో మండల ప్రజలను ఒకేచోట సమీకరించి పిల్లల భద్రత, డ్రగ్స్ నియంత్రణ, సైబర్ నేరాలు మరియు అరైవ్ అలైవ్ కార్యక్రమం భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి , ఎస్పి. నాయక్ బంజారా (ప్రవచనకర్త) హాజరయ్యారు. ఈ సందర్భంగా డీసీపీ బి. రామ్ రెడ్డి మాట్లాడుతూ, డ్రగ్స్,గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నదని తెలిపారు. యువత చెడు స్నేహాలు మరియు ప్రలోభాలకు లోనుకాకుండా తమ లక్ష్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఒక్కసారి డ్రగ్స్‌కు బానిస అయితే ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని చెప్పారు. డ్రగ్స్ సమస్య కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాకుండా సమాజానికి కూడా ప్రమాదకరమని పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయం, వినియోగం చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి అని పిలుపునిచ్చారు. పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని డీసీపీ తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదని హెచ్చరించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని డీసీపీ తెలిపారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, మితిమీరిన వేగంతో వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం వంటి నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, రామగుండం సీఐ ప్రవీణ్ కుమార్, అంతర్గం ఎస్ఐ వెంకట్, ఏంవిఐ రామగుండం సంతోష్ రెడ్డి, అంతర్గం మండల సర్పంచ్ లు, దాదాపు 300 మంది స్థానిక ప్రజలు, యువత, విద్యార్థులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రధాన జిల్లా కేంద్రాల చుట్టూ రింగు రోడ్లకు ప్రణాళికలు

### హైదరాబాద్ నుంచి నిర్దేశిత సమయంలో చేరేలా ప్రణాళికలు

### బోధనాసుపత్రులు, పెద్దాసుపత్రుల నిర్మాణాలు త్వరగా పూర్తి కావాలి

### ప్రభుత్వ శాఖలు ఈవీ వాహనాలే కొనుగోలు చేయాలి..

### ఆర్ అండ్ బీ, రవాణా శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 12 :** ప్రధాన జిల్లా కేంద్రాలన్నింటి చుట్టూ రింగు రోడ్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రాల్లోకి భారీ వాహనాలు వెళ్లకుండా చూడడంతో పాటు సరకు రవాణా వాహనాలు వేగంగా వెళ్లేందుకు రింగు రోడ్లు ఉపయోగపడతాయని సీఎం అన్నారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో ఆర్ అండ్ బీ శాఖపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి బుధవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ఆయా జిల్లా కేంద్రాలకు సమీపంలో రోడ్లు ఉంటే వాటిని అనుసంధానించి రింగ్ రోడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా జిల్లా కేంద్రాల నుంచి రింగు రోడ్లకు అనుసంధానించేలా రేడియల్ రోడ్లు నిర్మించాలని సీఎం తెలిపారు. జాతీయ రహదారులకు రింగు రోడ్లను అనుసంధానించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం ఆదేశించారు. హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెస్ వే నుంచి నాగార్జున సాగర్ చేరేందుకు గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణంపై అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే నిర్మాణంలో ఉన్న ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, అవసరమైన నూతన ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. బోధనాసుపత్రులు, ఇతర పెద్దాసుపత్రుల నిర్మాణలను త్వరగా పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, ఆర్ అండ్ బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. కాలుష్య రహిత రవాణాయే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక నుంచి ప్రభుత్వంలోని ఏ శాఖైనా తప్పనిసరిగా ఎలక్ట్రానిక్ వాహనాలనే కొనుగోలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. క్యూర్ పరిధిలో ప్రభుత్వ శాఖల పరిధిలో అద్దెలకు తీసుకునే వాహనాలు సైతం ఈవీలే ఉండాలని సీఎం తెలిపారు. రవాణా శాఖలోని మాన్యువల్ పద్ధతులకు స్వస్తి చెప్పాలని.. మొత్తం ఆన్‌లైన్‌లోనే కార్యకలాపాలు కొనసాగించాలని సీఎం ఆదేశించారు. ఆర్టీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడానికి వీల్లేదని, వెంటనే సొంత భవనాల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలపై అవగాహన పెంచాలని... ఇందుకు షార్ట్ ఫిల్మ్‌లు ప్రదర్శించాలని సీఎం సూచించారు. శంషాబాద్ సమీపంలో హైస్పీడ్ రైలు కారిడార్ ప్రారంభమయ్యే ప్రాంతంలో అధునాతన బస్ టెర్మినల్ కు స్థలం కేటాయిస్తామని.. అందుకు తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## దుబ్బాకలో త్వరలో జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం



**దుబ్బాక ప్రతినిధి మార్చి 12( వార్త సంధ్య ) :** సిద్దిపేట జిల్లా మాజీ బీఎస్పీ పార్టీ ప్రధాన కార్యదర్శి పర్సా రవీందర్ ముదిరాజ్ జనసేన పార్టీలో చేరిన సందర్భంగా దుబ్బాకలో త్వరలో పెద్ద ఎత్తున సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ ఇన్‌చార్జి శంకర్ గౌడ్ ఆయనకు శాలువా కప్పి సన్మానించి పార్టీలోకి గౌరవంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పర్సా రవీందర్ ముదిరాజ్, మారోజు లక్ష్మణాచారి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం చేస్తున్న జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా యువత, కార్మికులు సహా ప్రతి ఒక్కరూ సభ్యత్వం తీసుకోవాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో దుబ్బాకలో నిర్వహించే పార్టీ కార్యక్రమాలకు పెద్ద ఎత్తున హాజరై జనసైనికులుగా ప్రజా సమస్యల పరిష్కార దిశగా పనిచేయాలని కోరారు.అలాగే రానున్న జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థులను బరిలో నిలిపి భారీ మెజారిటీతో గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక జనసేన పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ వేడుకల్లో భాగంగా, తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు మేనేజింగ్ డైరెక్టర్, ప్రియాంక ఐఏఎస్ గురువారం నాడు మెగాస్టార్ డా. చిరంజీవి ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 12 :** ప్రభుత్వం ప్రకటించిన ప్రతిష్టాత్మక 'ఎన్టీఆర్ నేషనల్ ఫిలిం అవార్డు' ఎన్టీఆర్ జాతీయ అవార్డులను స్వీకరించాల్సిందిగా వారు చిరంజీవి గారిని సాదరంగా ఆహ్వానించారు. మార్చి 19, 2026న హైదరాబాద్‌లోని హైటెక్స్ వేదికగా జరగనున్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమానికి విచ్చేసి, ఈ గౌరవాన్ని అందుకోవాలని వారు కోరారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



### తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ప్రథమ మహిళ శ్రీమతి. జానకి శుక్ల కుటుంబ సభ్యులు గురువారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం శ్రీ పర్వత వర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయాన్ని దర్శించుకున్నారు




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 12 :** గవర్నర్ స్వామివారి ఆశీర్వాదం, వేద ఆశీర్వచనం కోసం ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం ఆయన ప్రార్థించారు రాష్ట్ర శ్రేయస్సు, అభివృద్ధి దేశ ప్రగతికి ఆశీస్సులు కోరారు. ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే, బీర్ల ఐలయ్య; జిల్లా కలెక్టర్, శ్రీ అనురాగ్ జయంతి, ఐఏఎస్,వై టి డి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జె. భవానీ శంకర్, ఐఏఎస్; జిల్లా ఎస్పి, అక్షాంశ్ యాదవ్, ఐపీఎస్; ఇతర సీనియర్ అధికారులు ప్రెసిడెన్షియల్ విల్లా వద్ద గవర్నర్‌కు స్వాగతం పలికారు.ప్రెస్ సెక్రటరీ

## రాష్ట్ర గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ్మస్వామి పుణ్యక్షేత్రాన్ని గురువారం కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు.




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 12 :** రాష్ట్ర గవర్నర్ కు ప్రభుత్వ విప్, ఆలేరు శాసన సభ్యులు బీర్ల ఐలయ్య,జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ , రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి గవర్నర్ కు పూల మొక్కలు బహుకరించి స్వాగతం పలికారు. తొలుత రాష్ట్ర గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. వేద పండితులు,





అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి భావానీ శంకర్ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు, వేద పండితులు ఆలయ సంప్రదాయంతో పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. గవర్నర్ ధ్వజ స్తంభం వద్ద మొక్కి స్వామి వారి అంతరాలయం లోఅర్చన పూజలు నిర్వహించారు.కార్య నిర్వాహణాధికా స్వామి వారి మెమొంటోను అందచేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త స్వామి వారి ప్రసాదాన్ని గవర్నర్ కు అందచేశారు. అనంతరం అనుబంధ దేవాలయం శ్రీ పర్వత వర్ధిణి సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో స్పటిక లింగానికి అభిషేకం చేసిన గవర్నర్ దంపతులు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, మార్చి 12:** ఎల్ బీ నగర్ నియోజకవర్గం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని గురుద్వారా రోడ్డు ప్రధాన రహదారి వద్ద ముదబ్బీర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో గ్రాండ్ ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హాజరై ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయాన మాట్లాడుతూ రంజాన్ మాసం పరస్పర ప్రేమ, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ పండుగలను సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, వనస్థలిపురం డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్, మధు గౌడ్, నవీద్, సంజయ్, కిషోర్ కుమార్ తదితర భారస నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతే లక్ష్యంగా మహిళలందరూ అన్ని రంగాల్లో పురోగమించాలి

**- రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త**




**హయత్‌నగర్ ప్రతినిధి,వార్త సంధ్య, మార్చి 12:** చైతన్యపురి కమ్యూనిటీ హాల్‌లో "ఓం శ్రీ మాత్రే నమః" సంస్థ మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల్లో ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలకు శుభాకాంక్షలు తెలియజేసిన శ్రీనివాస్ గుప్త సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు 75 % మున్సిపల్ చైర్మన్ గా , కౌన్సిలర్ లుగా అవకాశం కల్పించాడు అని ఆయన అన్నారు.పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి అని ఆయన అన్నారు. కుటుంబం నుండి దేశ నిర్మాణం వరకు ప్రతి రంగంలో మహిళలు విశేషమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల ప్రతినిధులు, కాలనీ వాసులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలను సత్కరించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

### పరీక్షకు సంబంధించిన వస్తువులను అందచేసిన ఎల్బీనగర్ యువ నాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్



**హయత్‌నగర్ ప్రతినిధి, వార్త సంధ్య, మార్చి 12:** 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు త్వరలో పబ్లిక్ పరీక్షలు జరగను న్నందున సాహెబ్ నగర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎల్బీనగర్ యువ నాయకులు ముద్దగౌని మనీష్ గౌడ్ ఎగ్జామ్స్ మెటీరియల్ ప్యాడ్లు, జామింట్రీ భాక్సులు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మనీష్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు... ఈ సందర్భంలో పాఠశాల ఉపాధ్యాయులు, మరియు సామ సాయి, సంతోష్, ఆశీష్, జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఎంపీ వద్దిరాజు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో సమావేశం

**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 12 :** అనేక అనర్థాలు, ఎంతోమంది ఆత్మహత్యలకు కారణంగా మారిన "పారాక్వాట్ డైక్లోరైడ్"అనే గడ్డిమందును నిషేధించాల్సిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర కేంద్ర వ్యవసాయ,రైతు సంక్షేమ శాఖల మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ను కోరారు.ఎంపీ రవిచంద్ర ఢిల్లీలో గురువారం సాయంత్రం మంత్రి చౌహాన్ తో సమావేశమై గడ్డిమందు (పురుగుల మందు) వల్ల చోటు చేసుకుంటున్న అనర్థాల గురించి వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి వినతిపత్రం సమర్పించారు.విషపూరితమైన ఈ గడ్డిమందుకు విరుగులేదని,చుక్క మింగినా ప్రాణాలు కోల్పోవాల్సిందేనని ఎంపీ రవిచంద్ర ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని వైద్యులు కూడా నిర్ధారించడం జరిగిందని మంత్రి చౌహాన్ దృష్టికి ఎంపీ రవిచంద్ర తీసుకువచ్చారు.ఈ పురుగుల మందును సుమారు 70 దేశాలు ఇప్పటికే నిషేధించడం జరిగిందని వినతిపత్రంలో ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు.ఈ విషపూరిత పురుగుల మందును నిషేధించి ఆత్మహత్యలు చోటు చేసుకోకుండా వెంటనే నిర్ణయం తీసుకోవలసిందిగా ఎంపీ వద్దిరాజు కేంద్ర మంత్రి చౌహాన్ కు విజ్ఞప్తి చేశారు.

# త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం

**పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగంలోకి తీసుకురండి**

**రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కి రూరల్ అగ్రి రీజియన్ పై దృష్టి సారించండి**

**ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 12 :** 2047 నాటికి త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో మొదట హోంశాఖ తదుపరి మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకం అన్నారు. ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక మీ కను సన్నల్లో ఉండాలని సూచించారు. విధుల నిర్వహణ క్రమంలో హోం శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచాలని సూచించారు. అదేవిధంగా నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుంది ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వేను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ మోడల్ అనివార్యమని ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. క్యూర్ తో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సీఎం సూచించారు. రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. మైక్రో, స్మాల్, మీడియం ఇండస్ట్రీస్ (ఎం ఎస్ ఎం ఈ)లను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రజా ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. ఎం ఎస్ ఎం ఈల ద్వారా రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి తో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగం ఎం ఎస్ ఎం ఈఅని తెలిపారు. 41 జీసీసీలతో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు అన్నారు. డాటా సెంటర్లలో వినియోగాన్నిపెద్ద ఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఆనంద్, శశాంక డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఫ్ఎంఎస్ పోర్టరలో నమోదులో జరిగిన సాంకేతిక లోపాలను సరిచేయండి

**వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డులకు వేతనాలు ఇవ్వండి :యాటల సోమన్న**

**యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి**



**హైదరాబాద్, వార్త సంధ్య :** తెలంగాణలోని 192 వ్యవసాయ మార్కెట్ కమిటీలలో కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ పద్ధతిన సుమారు 1,200 మంది సెక్యూరిటీ గార్డులు గత 30 సంవరాల నుండి (1994) మార్కెట్ యార్డులలో, చెకోపోస్టులలో, కార్యాలయాలల్లో విధులు నిర్వహిస్తున్నాము. మార్కెట్ యార్డులలో రైతుల సరుకులను రక్షిస్తూ, వేలం పాటలు నిర్వహించడం, కార్యాలయంలో క్లరికల్ పనులు చేస్తున్నాము. మార్కెట్ చెక్పోస్టులలో వ్యవసాయ దినుసుల రవాణా వాహనాలను ఆపి తనిఖీ చేసి స్వయంగా ట్యాబ్ ద్వారా లేదా కంప్యూటర్ ద్వారా నేరుగా ఆన్లైన్ రశీదు జారీ చేసి, మార్కెట్ ఫీజు వసూలు చేసి ప్రభుత్వ ఆదాయం పెంచడంలో రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా మేము పనిచేస్తున్నాము.

పోర్టర్ : (ఇంటిగ్రేటెడ్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టర్ లో తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో పని చేస్తున్న వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డుల బయోడేటా నమోదు చేయాలనీ రాష్ట్ర ప్రభుత్వం చెప్పింది. అటఎం లో సెక్యూరిటీ గార్డ్స్ బయోడేటా పూర్తీ చేసినప్పటికీ పోర్టర్లో ఏర్పడిన సాంకేతిక లోపాలు కారణంగా గార్డ్స్ బయోడేటా నమోదు కానట్టు చూపిస్తుంది. దీంతో ఆయా మార్కెట్లలో సెక్రటరీలు బిల్లు చేయడం లేదు. బయోడేటా పూర్తి కాకపోవడంతో నాలుగు నెలల నుండి అనేక మార్కెట్లలో సెక్యూరిటీర్డులకు వేతనాలు రావడం లేదు. దీంతో సెక్యూరిటీ గార్డుల కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. కాబట్టి ఐఎఫ్ఎంఎస్ పోర్టరలో నమోదులో జరిగిన సాంకేతిక లోపాలను వెంటనే సరిచేసి, సెక్యూరిటీ గార్డులకు వేతనాలు వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ రోజు (12.03.2026) వ్యవసాయ మార్కెటింగ్ శాఖ, సంచాలకులు గారికి తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బీఆర్క్ భవన్ లో రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల సాంబయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న వినతి ప్రత్రాన్ని అందజేశారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని అగ్రికల్చర్ మార్కెటింగ్ & కో ఆపరేటివ్ డిపార్ట్మెంట్ ద్వారా జిఓఆర్ టి నెం:814 తేది: 7/6/2013 మినిమమ్ టైం స్కేల్ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ (అటెండర్, వాచ్మెన్) వేతనం రూ.6,700/-లు చెల్లించాలని జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం వేతనాలు పొందాము. కానీ 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రభుత్వం 2016లో పిఆర్సిలో లాస్ట్ గ్రేడ్ సర్వీస్ వేతనం రూ.13,000/-లు చెల్లించాల్సి ఉండగా జి.వో.ఎం.ఎస్ నెం:14 తేది: 19-02-2016 ప్రకారం రూ.12,000/-లు మాత్రమే చెల్లిస్తున్నారు. దీంతో సెక్యూరిటీ గార్డులకు తీవ్ర అన్యాయం జరిగింది. రెండవ పిఆర్సిలో మినిమమ్ టైం స్కేల్ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ మినిమం బేసిక్ రూ.19,000/- లు చెల్లించాల్సి ఉండగా 30% శౌ శౌ 5.12,000/- 30% 2.3,600/- 50 . 15,600/-చేసి రెండవ సారి అన్యాయం చేశారు. కావున 2వ పిఆర్సీలోని మినిమం టైం స్కేల్ లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ బేసిక్ యిస్తూ మన డిపార్ట్ మెంట్ ప్రత్యేకంగా జీ.వో ఇవ్వాలని కోరుతున్నాం.

థర్డ్ పార్టీ ఏజెన్సీ ద్వారా పని చేయడం వలన వచ్చే వేతనాలు ప్రతినెలా సక్రమంగా రావడం లేదు. ఏజెన్సీలు ఇపిఎఫ్ సరిగ్గా చెల్లించపోవడం, సంవత్సరంలో ప్రతినెలా సక్రమంగా చెల్లింపులు లేకపోవడం వలన వడ్డీ సరిగా జమ కావడం లేదు. ఇఎస్ఐ సక్రమంగా చెల్లించకపోవడం వలన అనారోగ్యానికి గురైనప్పుడు వైద్య సౌకర్యాలు అందడం లేదు. కావున ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి నేరుగా మార్కెట్ కమిటీల ద్వారా వేతనాలు చెల్లించే విధంగా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నాం. సూచిక-2ని అనుసరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అక్కడి కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సాధారణ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాద మరణానికి రూ.6 లక్షలు వారి వారసులకు ఇచ్చే విధంగా, మహిళలకు 180 రోజుల ప్రసూతి సెలవులు ఇచ్చి వేతనం చెల్లించాలని జీ.వో. ఎంఎస్ నెం: 25 జారీ చేశారు. ఆ విధమైన జీ.వో మన రాష్ట్రంలో కూడా తెచ్చి అమలు చేయాలని కోరుతున్నాము. సూచిక-3ని అనుసరించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం చనిపోయిన కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు దహన ఖర్చుల నిమిత్తం రూ. 15,000/-లు చెల్లించాలని జి.వో.నెం: 119 జారీ చేసి అమలు చేస్తున్నారు. ఆ జి.ఓ.ను మన రాష్ట్రంలో సెక్యూరిటీ గార్డులకు అమలు చేయాలని కోరుతున్నాము.సూచిక-40 అనుసరించి వ్యవసాయ మార్కెట్ కమిటీలే నేరుగా ఇపిఎఫ్, ఈఎస్ఐలు చెల్లించాలని కోరుతున్నాము. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగి ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నప్పటికీ 61 సంIIరాల వయస్సు తరువాత రిటైర్మెంట్ అయితే ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకపోవడంతో రిటైర్మెంట్ అయిన తర్వాత కుటుంబ జీవనం కష్టంగా మారుతుంది. రిటైర్మెంట్ అయిన సెక్యూరిటీ గార్డులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరుతున్నాము.

పర్మిషన్ ఫర్ ఎన్గేజింగ్ : సెక్యూరిటీ గార్డులకు ప్రతి ఆర్థిక సంవత్సరం విధులు కొనసాగించుటకు సంవరం మొత్తానికి అనుమంచేవారు. కానీ 2026-27 ఆర్థిక సంవరం వార్షిక బడ్జెట్లో సంవనికి మొత్తానికి ఒకేసారి కొనసాగింపు అనుమతి ఉత్తర్వులు ఇవ్వగలరని విజ్ఞప్తి చేస్తున్నాం. ప్రస్తుతం వివిధ మార్కెట్ కమిటీలలో ఖాళీగా ఉన్న అటెండర్ నుండి మొదలుకొని సూపర్వైజర్ వరకు వివిధ పోస్టులలో మా సర్వీస్, విద్యార్హత ప్రకారం రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు.

యాటల సోమన్న
యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
9490098486

## "ప్రోత్సాహకాలు లేకుండా పెట్టుబడులకు ఎవరు ముందుకొస్తారు"

**వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తిని ప్రశ్నించిన హైకోర్టు**

**ప్రభుత్వ పాలసీలు, భూకేటాయింపులపై గురుమూర్తి పిల్‌పై హైకోర్టు విచారణ**

**మార్కెట్ ధరకు భూములిస్తామంటే కంపెనీలు దండం పెడతాయని వ్యాఖ్య**

**కంపెనీలు తమకు అనుకూల ప్రాంతాలకు వెళ్లే ప్రమాదం ఉందన్న హైకోర్టు**

కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, మొత్తం రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు వస్తారని వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తిని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ పాలసీలపై గురుమూర్తి వేసిన పిల్‌పై న్యాయస్థానం విచారణ జరిపింది. రాజకీయ నాయకుడిగానే మీరు పిల్ వేశారని వ్యాఖ్యానించింది.ప్రపంచ దేశాలు, పక్క రాష్ట్రాలతో పోటీని తట్టుకొని, పెట్టుబడులను రాబట్టాలి అంటే ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఎవరు ముందుకు వస్తారని వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తిని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. మార్కెట్ ధరకు భూములిస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం అంటే కంపెనీలు దండం పెట్టి తమకు అనుకూల ప్రాంతాలకు వెళ్లే ప్రమాదం ఉందని న్యాయస్థానం పేర్కొంది.

**గురుమూర్తి పిల్‌పై హైకోర్టు విచారణ:**

ప్రభుత్వం తీసుకు వచ్చిన విధానాలు (పాలసీలు), వివిధ సంస్థలకు భూముల కేటాయింపును సవాలు చేస్తూ గురుమూర్తి హైకోర్టులో పిల్ వేశారు. దీని పై ధర్మాసనం విచారణ జరిపింది. అభివృద్ధిలో పక్క రాష్ట్రాలతో పోటీ పడాలి అంటే భారీ స్థాయిలో పారిశ్రామికీకరణ జరగాలని, పెద్ద ఎత్తున పెట్టుబడులు రావాలని హైకోర్టు పేర్కొంది.ప్రభుత్వ విధానంలో వివిధ సంస్థలకు భూమి కేటాయింపును ఒక అంశంగా మాత్రమే చూడాలి అని దాని వల్ల భవిష్యత్తులో విస్తృత ప్రయోజనాలు ఉంటాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ విధానాలతో ఐటీ ఎకో సిస్టం అభివృద్ధి చెందితే 200 ఏళ్ల పాటు ప్రయోజనాలు ఉంటాయని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవడానికి తాము ఇక్కడ లేమని హైకోర్టు తేల్చి చెప్పింది. కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాల మధ్య వ్యత్యాసాలు ఉండవచ్చని, ఈ కారణంతో మొత్తం అభివృద్ధిని అడ్డుకోలేమని స్పష్టం చేసింది. కంపెనీలకు భూకేటాయింపుల విషయంలో ప్రభుత్వం తీసుకు వచ్చిన పాలసీని మేము విస్తృత కోణంలో చూడాల్సి ఉంటుందని హైకోర్టు వెల్లడించింది.

**పరిశ్రమల ఏర్పాటుకు యత్నం:**

రాష్ట్ర విభజన తర్వాత ఏపీ వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మిగిలి పోయిందని, ఈ నేపథ్యంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వ విధానాల వల్ల తాము పెట్టుబడులు పెట్టలేకపోతున్నామని ఏ ఒక్క కంపెనీ న్యాయస్థానానికి రాలేదు కదా అని ప్రశ్నించింది. రాజకీయ నాయకుడిగా మీరు ప్రభుత్వ విధానాన్ని సవాలు చేస్తూ, పిల్ వేశారని గురుమూర్తిని ఉద్దేశించి హైకోర్టు వ్యాఖ్యానించింది.ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాల్లో న్యాయస్థానాలు సహజంగా జోక్యం చేసుకోవని, తమ పాత్ర పరిమితమైందని తెలిపింది. భూకేటాయింపులు, ప్రభుత్వ విధానాలను సవాలు చేస్తూ ఇప్పటికే పలు ప్రజాహిత వ్యాజ్యాలు వేశారని గుర్తు చేసింది. ఇలాంటి చర్యలను అనుమతించబోమని స్పష్టం చేసింది. ప్రస్తుత పిల్‌లో కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. గతంలో దాఖలైన వ్యాజ్యాలతో ఈ పిల్‌ను జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం (నిన్న) ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.

## పశ్చిమాసియాలో యుద్ధం వల్ల గ్యాస్ కొరత



పశ్చిమాసియాలో యుద్ధం హోటల్ రంగానికి శాపంలా మారింది. నిత్యం వంట మంటలతో భగభగలాడే హోటళ్లలోని పాకశాలలు గ్యాస్ సిలిండర్లు లేక చల్లబడిపోతున్నాయి. గ్యాస్ కొరత మరింత తీవ్రమైతే హోటళ్లు, రెస్టారెంట్లు పూర్తిగా మూసివేయాల్సి వస్తుందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రంగాన్ని నమ్ముకున్న చాలా మంది రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గ్యాస్ కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం హోటల్ రంగంపై పెను ప్రభావం చూపుతోంది. ఎల్‌పీజీ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విజయవాడలో వన్ స్టార్ నుంచి త్రీస్టార్ వరకు వంద హోటళ్లు ఉండగా, మరో 350 వరకు మాదిరి హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. రోడ్డు పక్కన పెట్టే చిన్నచిన్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వారు చాలా మందే ఉన్నారు. వీరంతా గ్యాస్ కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 19 కిలోల సిలిండర్ ఒకప్పుడు 2 వేలు ఉండేదని, ప్రస్తుతం 3 వేల నుంచి 3500 వరకు అమ్ముతున్నారని యజమానులు చెబుతున్నారు. అధిక ధరకైనా కొందామంటే అదీ దొరకట్లేదంటున్నారు.హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితి: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఇది హోటల్ రంగానికి అత్యంత గిరాకీ సమయం. వివాహాలు, ఇతర శుభకార్యాలు చేసేవారు. హోటళ్లకు భారీ ఫుడ్ ఆర్డర్లు ఇస్తారు. గ్యాస్ కొరత వల్ల ఆర్డర్లు తీసుకోలేకపోతున్నామని హోటళ్ల యజమానులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొన్ని రోజుల్లో హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు.

**హోటళ్ల యజమానులకు పలు సూచనలు:** యుద్ధం నేపథ్యంలో కమర్షియల్ గ్యాస్ కొరతపై రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్, స్టార్ హోటల్స్ అసోసియేషన్ అత్యవసరంగా విజయవాడలో సమావేశమైంది. గ్యాస్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని అసోసియేషన్ సభ్యులు సూచించారు. ఈ మేరకు హోటళ్ల యజమానులకు పలు సూచనలు చేశారు. గ్యాస్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని అసోసియేషన్ సూచించింది. అందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించింది. గ్యాస్ పొదుపు చర్యల్లో భాగంగా స్టార్ హోటళ్లలో జొమాటో, స్విగ్గీలు వంటి ఆన్‌లైన్ ఆర్డర్లను త్వరలోనే నిలిపి వేస్తామని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. గ్యాస్ ఆదా చేసేందుకు ప్రతి సోమవారం రెస్టారెంట్లను పూర్తిగా మూసివేసి, 'వీక్లీ హాలిడే' ప్రకటించనున్నారు. దీని వల్ల కొంతవరకు గ్యాస్ ఆదా అవుతుందని వారు భావిస్తున్నారు."మొదటి విడతగా డిస్కౌంట్ అనేది పూర్తిగా రద్దు చేయండి. దానివల్ల కొంతమేరకు ఆర్డర్లు తగ్గుతాయి. తద్వారా 10 శాతం వ్యాపారం తగ్గేందుకు ఆస్కారం ఉంటుంది. అలాగే రెండవ విడతగా స్విగ్గీ, జొమాటోలను ఆపేయండి. తద్వారా 25-30 శాతం వరకు వ్యాపారం తగ్గుతుంది. ప్రతీ సోమవారం రెస్టారెంట్లు అన్నింటినీ మూసి వేయండి. వీక్లీ హాలిడే ప్రకటిస్తే గనక కొంత వినియోగాన్ని ఆదా చేసుకోవచ్చు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వినియోగించే వారికి వీలైనంత వరకు సప్లై కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.కర్ణాటక తరహాలో ఏపీలోనూ కొన్ని హోటల్స్ కేవలం టీ, కాఫీలు మాత్రమే విక్రయించే పరిస్థితి రాబోతోందని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల వరకే రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను నడిపేలా సమయం కుదించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని, డొమెస్టిక్ గ్యాస్ మాదిరిగానే కమర్షియల్ గ్యాస్‌ను కూడా సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్‌లను కలిసి వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆతిథ్య రంగంపై ఆధారపడిన వేల మంది కార్మికులు వీధిన పడకుండా చూడాలని, హాస్పిటాలిటీ రంగాన్ని ప్రాధాన్యత రంగంగా గుర్తించాలని వారు విజ్ఞప్తి చేశారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# మావోయిస్టుల దారెటు : రాజకీయాల్లోకి వస్తారా

**వస్తే ఏ పార్టీ వైపు నిలబడతారు**

**50 ఏళ్ల దండకారణ్యంలో ఉన్న గణపతి త్వరలో లొంగిపోనున్నట్లు సమాచారం**

**ఆపరేషన్ కగార్ వల్ల లొంగిపోయిన వేలాది మంది మావోయిస్టులు**

**మాతృ పార్టీ నేతలతో దేవ్‌జీ నేతృత్వంలో మాజీ మావోయిస్టులు భేటీ**

దేశంలో మావోయిస్టుల ఉనికి ఇక ప్రశ్నార్థకమేనా? ఇదివరకు జరిగిన అగ్ర నేతల లొంగుబాటుతో అవుననే సమాధానం వస్తోంది. ఇప్పటికే అగ్ర నేత దేవ్‌జీ లొంగిపోగా, 50 ఏళ్ల దండకారణ్యంలో మగ్గిన గణపతి త్వరలో లొంగిపోనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ లొంగుబాటుతో ఇక నక్సల్స్ కథ ముగిసినట్లేనా? దేశంలో తాడిత పీడిత ప్రజల కోసం ఆవిర్భవించిన మావోయిస్టు పార్టీ దాదాపు అర్ధ శతాబ్దం ప్రజల పక్షాన నిలిచింది. దొరలు, పెత్తందారుల రాక్షసత్వానికి నలిగిపోయిన బాధకు గురైన బడుగు బలహీన వర్గాలు, విద్యావంతులు, మేధావులు, యువత అడవి బాట పట్టారు. గిరిజనులు, ఆదివాసీలు నిరుపేదలకు రక్షణగా తుపాకులతో పహారా కాశారు. తమ జీవితాలను త్యాగం చేసి, ఎంతో మంది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు. పేద ప్రజలను పట్టి పీడిస్తున్న దోపిడీ పెత్తందారుల నుంచి విముక్తి కల్పిస్తూ అనేక మిలిటెంట్ ఉద్యమాలు చేశారు. ఈ ఉద్యమాల్లో ఎన్‌కౌంటర్ల పేరుతో వేలాది మంది అమరులయ్యారు.

**మావోయిస్టుల ఉనికి ప్రమాదంలో :** నానాటికీ పెరిగిపోతున్న సాంకేతికత, మారిపోతున్న నాగరికత మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపింది. దండకారణ్యం అబూజ్‌మడ్ అడవుల్లో తల దాచుకున్న మావోయిస్టులకు శాస్త్ర పరిజ్ఞానం యమపాశంగా మారింది. ఒక వైపు అంతరించిపోతున్న అడవులు, పెరిగిపోయిన సాంకేతికత, ప్రజల నుంచి ఆశించినంత ఆదరణ లేకపోవడంతో మావోయిస్టు ఉనికి ప్రమాదంలో పడింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్‌కు తెరలేపింది. దేశంలో నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలు అయిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర అడవుల్లో కేంద్ర బలగాలు సాంకేతికతను ఉపయోగించి మావోయిస్టుల ఏరివేతను లక్ష్యంగా పెట్టుకున్నాయి.

**జన జీవన స్రవంతిలో కలిసిపోతున్న మావోయిస్టులు :** కేంద్ర బలగాలు అడవిలోకి వెళ్లి క్యాంపులు ఏర్పాటు చేసుకుని, ఎన్‌కౌంటర్ల పేరుతో వేలాది మందిని తుదముట్టించింది. ఒకవైపు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ప్రతీకార చర్యలు, మరోవైపు ప్రజల నుంచి ఆదరణ కరవు, అడవులు అంతరించిపోతుండటం మావోయిస్టులను ఆలోచనలో పడేశాయి. ప్రజల్లో స్వార్థ ప్రయోజనాలు పెరిగినందున, అడవిని వీడి జనం బాట పట్టాలని మావోయిస్టు కేంద్ర కమిటీలో తీవ్ర చర్చ జరిగింది. దీనిని కొంత మంది స్వాగతించగా, మరికొంత మంది వ్యతిరేకించారు. తాజా పరిణామాల నేపథ్యంలో వేలాది మంది మావోయిస్టులు లొంగిపోయారు. మల్లోజుల వేణుగోపాల చారి, దేవ్ జీ లాంటి అగ్ర నేతలు



లొంగిపోగా, హిడ్మా ఎన్‌కౌంటర్ పేరుతో హతం అవడంతో అడవుల్లోని అన్నలు ఆయుధం వీడి ఓటు అనే వజ్రాయుధంలో బుద్ధి చెప్పాలని సంకల్పించి పెద్ద ఎత్తున జన జీవన స్రవంతిలో కలిసిపోయారు.

**గణపతి లొంగిపోతే ఉద్యమం ముగిసినట్లేనా? :** మావోయిస్ట్ పార్టీ ఉద్యమ అగ్రనేత గణపతి సైతం తొందరలోనే దిల్లీలో లొంగిపోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక గణపతి లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమం ముగిసినట్లేనని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ ఉద్యమాన్ని నడిపించిన కీలక నేతలు, వేలాది మంది లొంగిపోయిన మావోయిస్టులు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే మాతృ పార్టీ అయిన సీపీఐలో చేరాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల వేదిక నుంచి పిలుపునిచ్చారు. వారందరినీ కలిసికట్టుగా అందరం కూర్చొని నిర్ణయాలు తీసుకుని ప్రజల పక్షాన పోరాటం చేద్దామని సూచించారు. మరోవైపు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దేవ్‌జీ లాంటి అగ్ర నేతలతో రాజకీయ ఎజెండాతో భేటీ అయ్యారు.

**ఇవాళ మాజీ మావోయిస్టులు భేటీ :** కాంగ్రెస్‌లో చేరాలనుకునే లొంగిపోయిన మావోయిస్టులు పీసీసీ చీఫ్‌ను సంప్రదించాలని కోరారు. మావోయిస్టు ఉద్యమాన్ని అర్ధ శతాబ్దం పాటు నడిపిన అగ్ర నాయకులు అత్యంత విద్యావంతులు, మేధావులు కావడం, నిస్వార్థ ప్రయోజనాలు కలిగి ఉండటం తమ పార్టీకి బలం చేకూరుతుందని రాజకీయ పార్టీలు అంతర్గతంగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మొత్తంగా లొంగిపోయిన మావోయిస్టులు రాజకీయాల్లోకి వస్తారా? వస్తే మాతృ పార్టీ అయిన సీపీఐలో చేరతారా? లేక కొత్త పార్టీ ఏమైనా పెడతారా? వేచి చూడాలి.

# మరో ట్రెండ్‌కు మల్లారెడ్డి శ్రీకారం!

**'విరోష్' తరహాలో గ్రాండ్‌గా 'మల్పన' వెడ్డింగ్**

**మరోసారి పెళ్లి కుమారుడిగా ముస్తాబవుతున్న మాజీ మంత్రి మల్లారెడ్డి**

**ఉగాది రోజున సతీమణి కల్పనను మరోసారి మనువాడనున్న మల్లారెడ్డి**

**వివాహబంధంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవం**



మల్లారెడ్డి రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు ఇది. ఆయన ఏం చేసినా అది వైరల్‌గా మారుతుంది. డెబ్బై పదుల వయసులోనూ ఆయన ఉత్సాహం నవ యువకుడిలా ఉంటుంది. పూలమ్మినా, పాలమ్మినా, కష్టపడ్డా అంటూ ఆయన చెప్పిన డైలాగ్ ఎంత ఫేమస్ అయిందో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. కాలేజీ, సినిమా రిలీజ్ ఫంక్షన్లలో ఆయన చెప్పే డైలాగులు, నృత్యాలు ఎవరూ మర్చిపోలేరు. స్టార్ హీరోలతో సమానంగా స్టెప్‌లు వేస్తూ అందరినీ అలరిస్తూ నవ్వులు పూయిస్తుంటారు.తాజాగా మల్లారెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. ఇంతకీ విశేషం ఏమంటారా? ఆయన మళ్లీ పెళ్లికుమారుడు కాబోతున్నారు. 50 ఏళ్ల వివాహ మహోత్సవ వేడుకలో భాగంగా తన శ్రీమతి కల్పనను మరోసారి మనువాడనున్నారు. ఉగాది రోజున నిర్వహించే ఈ వేడుకలో సంగీత్, హల్దీ వంటి కార్యక్రమాలు అట్టహాసంగా జరగనున్నాయి. 'విరోష్' పెళ్లి తరహాలో మల్లారెడ్డి దంపతులు 'మల్పన' పేరుతో ట్రెండ్ సెట్ చేసేందుకు సిద్ధమయ్యారు.

**మళ్లీ పెళ్లి చేసుకోనున్న మల్లారెడ్డి :** చామకూర మల్లారెడ్డి. నిత్యం ఏదో ఒక హడావుడితో వార్తల్లో నిలవడం ఆయన ప్రత్యేకత. రాజకీయాలు, విద్య, వ్యాపారం, కుటుంబం ఇలా ఏ రంగంలోనైనా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తారు. ప్రస్తుతం 72 ఏళ్ల వయసులో మల్లారెడ్డి మరోమారు కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. మల్లారెడ్డి, ఆయన సతీమణి కల్పనకు వివాహం జరిగి ఈ నెల 19వ తేదీతో 50 వసంతాలు అవుతోంది. వివాహ స్వర్ణోత్సవాన్ని ఘనంగా చేసుకునేందుకు సిద్ధమయ్యారు ఈ జంట. ఏదో ఒక రోజు అట్టహాసంగా చేసుకునే వేడుకలా కాకుండా ప్రస్తుతం పెళ్లిళ్ల తరహాలోనే సంగీత్, హల్దీ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అవి కూడా ఒక్కో రోజు ఒక్కో చోట నిర్వహిస్తున్నారు.

**వేడుకల్లో భాగంగా కార్యక్రమాల వివరాలు ఇవే :** వేడుకల్లో భాగంగా ఈ నెల 12న సత్యనారాయణ స్వామి వ్రతం, 13న మల్లిఖార్జున స్వామి కల్యాణం జరపనున్నారు. ఈ రెండు వేడుకల్ని బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి నివాసంలో నిర్వహిస్తారు. మేడ్చల్ సమీపంలోని అద్వయ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 14న సంగీత్, కొంపల్లిలోని మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి నివాసంలో 16న మెహందీ, హల్దీ కార్యక్రమాలు జరుపుతారు. ఈ నెల 19న కొంపల్లిలోని మరో కుమారుడు మహేందర్ రెడ్డి నివాసంలో వివాహ వేడుకల్ని చేయనున్నారు.

**'మల్పన' పేరుతో స్వర్ణోత్సవ వేడుకలు :** వివాహ వేడుకల్లో భాగంగా రాంపల్లిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇటీవల ప్రారంభించారు. మల్లారెడ్డి తన వివాహ స్వర్ణోత్సవానికి ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు పార్టీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులను ఆహ్వానించారు. కేటీఆర్ సూచన మేరకు మల్లారెడ్డి, ఆయన సతీమణి కల్పన పేర్లు కలిసివచ్చేలా "మల్పన" పేరుతో వివాహ స్వర్ణోత్సవ వేడుకలు చేసుకుంటున్నట్లు మల్లారెడ్డి తెలిపారు.ప్రస్తుత కాలంలో చిన్న చిన్న కారణాలతోనే భార్యాభర్తలు విడిపోతున్నారని, పరస్పరం అర్థం చేసుకోవడం ద్వారా మాత్రమే 50 ఏళ్లుగా కలిసి ఉన్నామన్న సందేశం ఇవ్వడం కోసమే వివాహ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మల్లారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమాలకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. తాజా వివాహ వేడుక ద్వారా ఆయన రెండు రాష్ట్రాల్లో వార్తల్లో నిలిచారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మల్లారెడ్డి వివాహ పోస్టులే వైరల్ అవుతున్నాయి. తాజా కార్యక్రమం ద్వారా ఆయన మరోసారి హాట్‌టాపిక్‌గా మారారు. ఆయన వివాహ స్వర్ణోత్సవ వేడుకలకు సినీ, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు హాజరుకానున్నట్లుగా తెలుస్తోంది.

# గ్యాస్ కొరతతో రెస్టారెంట్లలో మారిన మెనూ కార్డు

**ఆ క్రేజీ ఐటెమ్స్ ఔట్**

**ముందుగా బుక్ చేసుకున్న పెళ్లిళ్లు, రిసెప్షన్‌లకే ఆతిథ్యం**

**వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాను ఏజెన్సీలు నిలిపేయడంతో స్టార్ హోటళ్లకు అంతరాయం**

**పలు ప్రాంతాల్లో పెరిగిన కట్టెల పొయ్యిల వినియోగం**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాను ఏజెన్సీలు నిలిపేయడంతో స్టార్ హోటళ్లు విద్యుత్ స్టవ్‌లు, ఆవిరి యంత్రాలపై వంటలు చేయిస్తున్నాయి. అంతేకాదు ముందుగా బుక్ చేసుకున్న పెళ్లిళ్లు, రిసెప్షన్ ఇలాంటి వేడుకలకు మాత్రమే ఆతిథ్యం ఇవ్వనున్నాయి. నగరంలోని కొన్ని స్టార్ హోటళ్లలో విదేశీ అతిథులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి సంపూర్ణ ఆతిథ్యాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం తమ వద్ద కేవలం ఒకట్రెండు రోజులకు మాత్రమే సరిపడేలా ఉన్న నేపథ్యంలో ఏజెన్సీలు సరఫరా చేయకపోతే కేవలం అతిథులకు మాత్రమే ఆహారం అందించేందుకు వీలవుతుందని ఫైవ్‌స్టార్ హోటల్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

**హోటల్ మెనూలో మార్పులు :** గ్యాస్ కొరత దృష్ట్యా కొన్ని స్టార్ హోటళ్ల మెనూలో మార్పులు చేశారు. ఇంధనం ఎక్కువగా వినియోగించే గ్రిల్డ్ చికెన్, మటన్, కబాబ్‌లను మెనూలో నుంచి తొలగించారు.బంజారాహిల్స్‌లోని ఒక స్టార్ హోటల్ రోజుకు 50 సిలిండర్లను వాడుతున్నారు. అయితే సరఫరా ఉండబోదనే అంచనాలతో భోజనం తినేందుకు మాత్రమే వస్తున్న వారికి కొన్నే ఆహార పదార్థాలు ఉన్నాయని తెలుపుతున్నారు.హైదరాబాద్ లక్డీకపూల్‌లోని షాగౌస్ హోటల్‌లో బుధవారం మధ్యాహ్నం కట్టెల పొయ్యిపైనే బిర్యానీ చేసినట్లు హోటల్ యజమాని రబ్బానీ పేర్కొన్నారు. గ్రేటర్ పరిధిలోని ప్యారడైజ్ హోటళ్లలో అవసరమైన చోట్ల విద్యుత్‌పై వంటలు చేస్తున్నారని ప్యారడైజ్ ఫుడ్‌కోర్టు ఎండీ అభిక్ మిత్రా తెలిపారు.ప్రభుత్వం స్పందించాలి – లేదంటే అంతే సంగతులు : హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో వసతి పొందుతున్న ప్రైవేటు పీజీ హాస్టళ్లకు వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ కోరింది. రాయదుర్గంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి మహీదర్ తదితరులు మాట్లాడారు. హైదరాబాద్‌లోని 11 వేల హాస్టళ్లలో వసతి పొందుతున్న 10 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఒక్కో హాస్టల్‌లో దాదాపు 100 నుంచి 300 మంది వరకు ఉన్నారని, ఒక వాణిజ్య సిలిండర్ రెండు రోజులు వస్తుందని పేర్కొన్నారు. కానీ మంగళవారం సాయంత్రం నుంచి ఈ సరఫరా కూడా నిలిపివేశారన్నారు. అంతేకాదు తాజాగా 35 శాతం ధర పెరిగినా భరిస్తున్నామన్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత ఉంటే గృహావసరాలకు పంపిణీ చేసే వాటినైనా అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వాలు స్పందించాలని, లేదంటే హాస్టళ్లను మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు.

**గ్యాస్ లేక కష్టాలు – కట్టెల పొయ్యిల వినియోగం :** కేంద్ర సర్కార్ ఆదేశాల మేరకు వాణిజ్య, రాయితీయేతర సిలిండర్ల సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం ఆపేయడంతో ఆసుపత్రులు, గురుకులాలు, హాస్టళు



,, హోటళ్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హైదరాబాద్ చర్లపల్లిలోని భారత్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం ఇంధన సరఫరా 75 శాతం తగ్గింది. రాష్ట్రంలో కోటి 30 లక్షలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెల దాదాపు 20 లక్షల వాణిజ్య, రాయితీయేతర సిలిండర్లే సరఫరా అవుతున్నాయి. పరిశ్రమల అవసరాల కోసం బల్క్ ఎల్‌పీజీ వినియోగం సైతం ప్రతి నెల సుమారు 20–22 వేల టన్నులు వినియోగిస్తున్నారు. ఆటోలు, కార్ల ఎల్‌పీజీ వాడకం కూడా నెలకు 9–10 వేల టన్నుల వరకు ఉంది.

**వివిధ రంగాలపై ప్రభావం :**

రాష్ట్రంలో 295 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు కేటరింగ్ సంస్థల ద్వారా ఆహార సరఫరా జరుగుతుండగా, ప్రస్తుతం వాటికి సిలిండర్ల సరఫరా ఆగిపోయింది.తెలంగాణలో 1200కి పైగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగుల గురుకులాలు వసతి గృహాలున్నాయి. వీటన్నింటికి సిలిండర్ల ద్వారా వంట చేస్తున్నారు. ప్రతి గురుకులం, వసతి గృహానికి వారానికి 11, నెలకు 40–45 సిలిండర్లు వినియోగిస్తున్నారు.రైల్వే కేటరింగ్ లైసెన్సీలు వెండర్లు, ఫుడ్ ప్లాజాలు, రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు, జన ఆహార్ అవుట్‌లెట్‌లలో గ్యాస్ సిలిండర్లకు బదులుగా మైక్రోవేవ్ ఓవెన్లు, ఇండక్షన్ స్టవ్‌లు వాడాలని ఐఆర్‌సీటీసీ ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ భోజనం అందించలేకపోతే ఆహారం కోసం చెల్లించిన డబ్బులను తిరిగి ప్రయాణికులకు చెల్లించనున్నట్లు తెలిపింది.రాష్ట్రంలో ప్రతి నెలా 58–60 లక్షల వరకు గృహ వినియోగ సిలిండర్లు బుకింగ్ అవుతుంటాయి. కానీ గత రెండు రోజుల్లోనే 12 లక్షలు బుక్ అయ్యాయి. కొరత పెరగడంతో పొయ్యిలు, కుంపట్లపై పలువురు దృష్టి పెట్టడంతో కట్టెలు, బొగ్గుల వినియోగం బాగా పెరిగింది. బుధవారం ఒక రోజునే 10 టన్నుల కట్టెలను విక్రయించినట్లు ఎల్బీనగర్‌లోని కట్టెల వ్యాపారి పేర్కొన్నారు.

# "ప్రోత్సాహకాలు లేకుండా పెట్టుబడులకు ఎవరు ముందుకొస్తారు"

**వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తిని ప్రశ్నించిన హైకోర్టు**

**ప్రభుత్వ పాలసీలు, భూకేటాయింపులపై గురుమూర్తి పిల్‌పై హైకోర్టు విచారణ**

**మార్కెట్ ధరకు భూములిస్తామంటే కంపెనీలు దండం పెడతాయని వ్యాఖ్య**

**కంపెనీలు తమకు అనుకూల ప్రాంతాలకు వెళ్లే ప్రమాదం ఉందన్న హైకోర్టు**




కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, మొత్తం రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు వస్తారని వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తిని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ పాలసీలపై గురుమూర్తి వేసిన పిల్‌పై న్యాయస్థానం విచారణ జరిపింది. రాజకీయ నాయకుడిగానే మీరు పిల్ వేశారని వ్యాఖ్యానించింది.ప్రపంచ దేశాలు, పక్క రాష్ట్రాలతో పోటీని తట్టుకొని, పెట్టుబడులను రాబట్టాలి అంటే ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఎవరు ముందుకు వస్తారని వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తిని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. మార్కెట్ ధరకు భూములిస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం అంటే కంపెనీలు దండం పెట్టి తమకు అనుకూల ప్రాంతాలకు వెళ్లే ప్రమాదం ఉందని న్యాయస్థానం పేర్కొంది.

**గురుమూర్తి పిల్‌పై హైకోర్టు విచారణ:** ప్రభుత్వం తీసుకు వచ్చిన విధానాలు (పాలసీలు), వివిధ సంస్థలకు భూముల కేటాయింపును సవాలు చేస్తూ గురుమూర్తి హైకోర్టులో పిల్ వేశారు. దీని పై ధర్మాసనం విచారణ జరిపింది. అభివృద్ధిలో పక్క రాష్ట్రాలతో పోటీ పడాలి అంటే భారీ స్థాయిలో పారిశ్రామికీకరణ జరగాలని, పెద్ద ఎత్తున పెట్టుబడులు రావాలని హైకోర్టు పేర్కొంది.ప్రభుత్వ విధానంలో వివిధ సంస్థలకు భూమి కేటాయింపును ఒక అంశంగా మాత్రమే చూడాలి అని దాని వల్ల భవిష్యత్తులో విస్తృత ప్రయోజనాలు ఉంటాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ విధానాలతో ఐటీ ఎకో సిస్టం అభివృద్ధి చెందితే 200 ఏళ్ల పాటు ప్రయోజనాలు ఉంటాయని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవడానికి తాము ఇక్కడ లేమని హైకోర్టు తేల్చి చెప్పింది. కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాల మధ్య వ్యత్యాసాలు ఉండవచ్చని, ఈ కారణంతో మొత్తం అభివృద్ధిని అడ్డుకోలేమని స్పష్టం చేసింది. కంపెనీలకు భూకేటాయింపుల విషయంలో ప్రభుత్వం తీసుకు వచ్చిన పాలసీని మేము విస్తృత కోణంలో చూడాల్సి ఉంటుందని హైకోర్టు వెల్లడించింది.

**పరిశ్రమల ఏర్పాటుకు యత్నం:** రాష్ట్ర విభజన తర్వాత ఏపీ వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మిగిలి పోయిందని, ఈ నేపథ్యంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వ విధానాల వల్ల తాము పెట్టుబడులు పెట్టలేకపోతున్నామని ఏ ఒక్క కంపెనీ న్యాయస్థానానికి రాలేదు కదా అని ప్రశ్నించింది. రాజకీయ నాయకుడిగా మీరు ప్రభుత్వ విధానాన్ని సవాలు చేస్తూ, పిల్ వేశారని గురుమూర్తిని ఉద్దేశించి హైకోర్టు వ్యాఖ్యానించింది.ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాల్లో న్యాయస్థానాలు సహజంగా జోక్యం చేసుకోవని, తమ పాత్ర పరిమితమైందని తెలిపింది. భూకేటాయింపులు, ప్రభుత్వ విధానాలను సవాలు చేస్తూ ఇప్పటికే పలు ప్రజాహిత వ్యాజ్యాలు వేశారని గుర్తు చేసింది. ఇలాంటి చర్యలను అనుమతించబోమని స్పష్టం చేసింది. ప్రస్తుత పిల్‌లో కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. గతంలో దాఖలైన వ్యాజ్యాలతో ఈ పిల్‌ను జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం (నిన్న) ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.

# పశ్చిమాసియాలో యుద్ధం వల్ల గ్యాస్ కొరత

**సిలిండర్లు దొరక్క హోటళ్ల యజమానుల ఇబ్బందులు**

**సిలిండర్ రూ.3500 వరకు అమ్ముతున్నారని ఆరోపణ**

**బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయాలని ప్రభుత్వానికి వినతి**

**అత్యవసరంగా సమావేశమైన హోటళ్ల అసోసియేషన్ నేతలు**

**గ్యాస్ వినియోగం తగ్గించాలని హోటళ్ల యాజమాన్యానికి సూచన**




పశ్చిమాసియాలో యుద్ధం హోటల్ రంగానికి శాపంలా మారింది. నిత్యం వంట మంటలతో భగభగలాడే హోటళ్లలోని పాకశాలలు గ్యాస్ సిలిండర్లు లేక చల్లబడిపోతున్నాయి. గ్యాస్ కొరత మరింత తీవ్రమైతే హోటళ్లు, రెస్టారెంట్లు పూర్తిగా మూసివేయాల్సి వస్తుందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రంగాన్ని నమ్ముకున్న చాలా మంది రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గ్యాస్ కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం హోటల్ రంగంపై పెను ప్రభావం చూపుతోంది. ఎల్‌పీజీ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విజయవాడలో వన్ స్టార్ నుంచి త్రీస్టార్ వరకు వంద హోటళ్లు ఉండగా, మరో 350 వరకు మాదిరి హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. రోడ్డు పక్కన పెట్టే చిన్నచిన్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వారు చాలా మందే ఉన్నారు. వీరంతా గ్యాస్ కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 19 కిలోల సిలిండర్ ఒకప్పుడు 2 వేలు ఉండేదని, ప్రస్తుతం 3 వేల నుంచి 3500 వరకు అమ్ముతున్నారని యజమానులు చెబుతున్నారు. అధిక ధరకైనా కొందామంటే అదీ దొరకట్లేదంటున్నారు.హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితి: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఇది హోటల్ రంగానికి అత్యంత గిరాకీ సమయం. వివాహాలు, ఇతర శుభకార్యాలు చేసేవారు. హోటళ్లకు భారీ ఫుడ్ ఆర్డర్లు ఇస్తారు. గ్యాస్ కొరత వల్ల ఆర్డర్లు తీసుకోలేకపోతున్నామని హోటళ్ల యజమానులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొన్ని రోజుల్లో హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు.

**హోటళ్ల యజమానులకు పలు సూచనలు:** యుద్ధం నేపథ్యంలో కమర్షియల్ గ్యాస్ కొరతపై రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్, స్టార్ హోటల్స్ అసోసియేషన్ అత్యవసరంగా విజయవాడలో సమావేశమైంది. గ్యాస్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని అసోసియేషన్ సభ్యులు సూచించారు. ఈ మేరకు హోటళ్ల యజమానులకు పలు సూచనలు చేశారు. గ్యాస్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని అసోసియేషన్ సూచించింది. అందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించింది. గ్యాస్ పొదుపు చర్యల్లో భాగంగా స్టార్ హోటళ్లలో జొమాటో, స్విగ్గీలు వంటి ఆన్‌లైన్ ఆర్డర్లను త్వరలోనే నిలిపి వేస్తామని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. గ్యాస్ ఆదా చేసేందుకు ప్రతి సోమవారం రెస్టారెంట్లను పూర్తిగా మూసివేసి, 'వీక్లీ హాలిడే' ప్రకటించనున్నారు. దీని వల్ల కొంతవరకు గ్యాస్ ఆదా అవుతుందని వారు భావిస్తున్నారు."మొదటి విడతగా డిస్కౌంట్ అనేది పూర్తిగా రద్దు చేయండి. దానివల్ల కొంతమేరకు ఆర్డర్లు తగ్గుతాయి. తద్వారా 10 శాతం వ్యాపారం తగ్గేందుకు ఆస్కారం ఉంటుంది. అలాగే రెండవ విడతగా స్విగ్గీ, జొమాటోలను ఆపేయండి. తద్వారా 25–30 శాతం వరకు వ్యాపారం తగ్గుతుంది. ప్రతీ సోమవారం రెస్టారెంట్లు అన్నింటినీ మూసి వేయండి. వీక్లీ హాలిడే ప్రకటిస్తే గనక కొంత వినియోగాన్ని ఆదా చేసుకోవచ్చు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వినియోగించే వారికి వీలైనంత వరకు సప్లై కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.కర్ణాటక తరహాలో ఏపీలోనూ కొన్ని హోటల్స్ కేవలం టీ, కాఫీలు మాత్రమే విక్రయించే పరిస్థితి రాబోతోందని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల వరకే రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను నడిపేలా సమయం కుదించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని, డొమెస్టిక్ గ్యాస్ మాదిరిగానే కమర్షియల్ గ్యాస్‌ను కూడా సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్‌లను కలిసి వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆతిథ్య రంగంపై ఆధారపడిన వేల మంది కార్మికులు వీధిన పడకుండా చూడాలని, హాస్పిటాలిటీ రంగాన్ని ప్రాధాన్యత రంగంగా గుర్తించాలని వారు విజ్ఞప్తి చేశారు.

వార్త సంధ్య
RNI TGTEL/25/A5065


# అబద్ధాలకు అడ్డుకట్ట!



కొందరు పిల్లలు.. చాలా సులభంగా అబద్ధం చెప్పేస్తుంటారు. తప్పు చేసినప్పుడో, తల్లిదండ్రులను సంతోషపెట్టడానికో.. కట్టుకథలు అల్లుతుంటారు. పెరుగుతున్న కొద్దీ 'అది తప్పు!' అని తెలుసుకొని మానేస్తారు. కొందరు మాత్రం.. పెద్దయ్యాక కూడా కొనసాగిస్తుంటారు. 'అబద్ధాల కోరు!'గా ముద్రవేసుకుంటారు. అలా కావొద్దంటే.. బాల్యంలోనే అసత్యాల కొమ్మను వంచేయాలని మానసిక నిపుణులు సూచిస్తున్నారు. పిల్లలు అబద్ధాలు చెప్తున్నారని ఇట్టే తెలిసిపోతుంది. అప్పుడప్పుడు చెబితే ఫర్వాలేదు. కానీ, అన్నిటికీ అబద్ధం చెబుతుంటే మాత్రం.. తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. ఆదిలోనే వాటికి అడ్డుకట్ట వేయాలి. ఇందుకోసం.. పిల్లలు నిజాయతీగా ఉండేలా ప్రత్యేక చొరవ చూపాలి. వారు ఎప్పుడూ నిజం చెప్పేలా ప్రోత్సహించాలి. అసలు వారు ఎందుకు అబద్ధం చెబుతున్నారో తెలుసుకోవాలి. దాని వెనుక ఉన్న కారణాన్ని అర్థం చేసుకోవాలి. నిజం చెప్పినా.. ఎలాంటి సమస్యా ఉండదన్న భరోసా వారికి ఇవ్వాలి. అప్పుడే.. పిల్లలు అబద్ధాలు చెప్పకుండా ఉండగలుగుతారు.


### ఎందుకు అబద్ధం చెబుతారు?

ఏదైనా పొరపాటు చేసినప్పుడు.. శిక్ష నుంచి తప్పించుకోవడానికి ఎక్కువగా అబద్ధం చెబుతుంటారు. డెవలప్‌మెంట్ సైకాలజీలో 2002లో ప్రచురితమైన ఒక అధ్యయనం కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. తప్పు చేసినప్పుడు నిజాయతీగా ఉంటే.. ఫలితం ప్రతికూలంగా ఉంటుందని వారి నమ్మకం. అందుకే, అబద్ధాన్ని ఒక వ్యూహంగా మలుచుకుంటారు.ఇక చాలా సందర్భాల్లో తల్లిదండ్రుల ప్రశంసలు పొందడానికి కూడా పిల్లలు అబద్ధాలు ఆడుతుంటారట. 2016లో జర్నల్ ఆఫ్ ఎక్స్‌పెరిమెంటల్ చైల్డ్ సైకాలజీ జరిపిన ఓ పరిశోధన ఈ విషయాన్ని తేల్చింది. తాము అన్నిట్లో బెస్ట్ అనిపించుకోవడానికి, సామాజిక అంచనాలను అందుకోవడానికి పిల్లలు అబద్ధాలు చెబుతారని వెల్లడైంది. పిల్లలు పెరిగేకొద్దీ.. స్వయంప్రతిపత్తిని కోరుకుంటారు. ఈ క్రమంలోనూ అబద్ధం చెబుతారు. ముఖ్యంగా, టీనేజర్లు ఎక్కడికి వెళ్తున్నదనీ, ఏం చేస్తున్నదీ తల్లిదండ్రుల దగ్గర దాచి పెడుతుంటారు. జర్నల్ ఆఫ్ అడోలెసెన్స్‌లో 2010లో ప్రచురితమైన సర్వే.. ఇందుకు సంబంధించిన సమాచారాన్ని బయటపెట్టింది. అయితే, టీనేజర్లు ఇలా సమాచారాన్ని దాచిపెట్టడం వెనక దురుద్దేశం ఉండదు. కేవలం వారి గోప్యత, స్వాతంత్ర్య భావాన్ని కాపాడుకోవడానికే అని సదరు సర్వే తేల్చింది.

### తల్లిదండ్రులు ఏం చేయాలి?


అబద్ధం చెప్పడం చెడు ప్రవర్తన కాదు. వారి తెలివితేటలు, సృజనాత్మకత, సామాజిక అభ్యాసాన్ని ప్రతిబింబించే ఓ మైలురాయి కూడా! అయితే, ఈ విషయంలో తల్లిదండ్రులు ఎలా స్పందిస్తారనేదే ముఖ్యం. తప్పు చేసినప్పుడు కఠినంగా శిక్షించే బదులు.. వారిలో నిజాయతీని ప్రోత్సహించాలి. అబద్ధం కన్నా.. 'నిజం చెప్పడమే మంచిది' అనే వాతావరణాన్ని సృష్టించాలి. నిజం ఎంత విలువైనదో వివరిస్తే.. పిల్లలు అబద్ధాలకు దూరంగా ఉంటారు. పిల్లలు తాము చూసే వాటినే ఎక్కువగా అనుకరిస్తారు. తల్లిదండ్రులు తరచుగా 'చిన్న చిన్న అబద్ధాలు' ఉపయోగిస్తే.. పిల్లలు కూడా అదే నేర్చుకుంటారు. తల్లిదండ్రులు నిజాయతీగా ఉంటే.. పిల్లలూ అదే బాటలో నడుస్తారు.

# ఈ లక్షణాలు కనిపిస్తే కిడ్నీలు డేంజర్ లో ఉన్నట్లే - నిర్లక్ష్యం చేయద్దు



శరీరంలోని ప్రధాన భాగం కిడ్నీలు. కిడ్నీలు రక్తాన్ని శుభ్రం చేస్తాయి. మనం పాటించే ఆహారపు అలవాట్లు, జీవనశైలి, పలు ఇతర కారణాల వల్ల కిడ్నీల పనితీరును ప్రభావితం చేస్తుంది. దీంతో అనేక కిడ్నీ సమస్యలు వస్తాయి. కిడ్నీలు డ్యామేజ్ అయితే కొందరిలో లక్షణాలు ఏమీ బయటకు కనిపించవు. కానీ చాలా వరకు వ్యక్తులలో లక్షణాలను ముందుగానే పసిగట్టవచ్చు. ఆ లక్షణాలను ముందుగానే గుర్తిస్తే తగిన సమయంలో చికిత్స తీసుకుని కిడ్నీలను రక్షించుకోవచ్చు. దీంతో కిడ్నీలకు కలిగే ప్రమాదం తప్పుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కిడ్నీల పనితీరు పైన మనకు ఎప్పటికప్పుడు స్పష్టమైన సంకేతాల అందుతాయి. వీటిని జాగ్రత్త గా గమనిస్తూ అవసరమైన చికిత్స తీసుకోవటం ద్వారా ముప్పు తప్పించుకోవచ్చు. కిడ్నీలు డ్యామేజ్ అయినప్పుడు లేదా డ్యామేజ్ అవుతున్న సమయంలో మూత్రంలో పలు మార్పులు కనిపిస్తాయి. ముఖ్యంగా తరచూ మూత్ర విసర్జనకు వెళ్లాల్సి వస్తుంది. రాత్రి పూట ఈ అవసరం మరింత ఎక్కువగా ఉంటుంది. మీకు షుగర్ లేకపోయినా తరచూ మూత్రం వస్తుందంటే మీ కిడ్నీల సమస్య ఉందని అనుమానించాలి. మూత్రంలో నురుగు వస్తున్నా జాగ్రత్త పడాలి. మూత్రంలో ప్రోటీన్ ఉంటే ఇలా నురుగు కనిపిస్తుంది. వాస్తవానికి ఇది ప్రమాదకరం. అలాగే కొందరికి మూత్రంలో రక్తం పడుతుంది. దీన్నే హెమటురియా అంటారు. ఇది కూడా ఒక ప్రమాదకరమైన స్థితిగానే భావించాలి. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. %ూశ్రీంశీ =ఝఃు% తిరుపతి వెళ్లే భక్తులకు ఊహించని వరం – ఇక నుంచి..!! కిడ్నీల సమస్యలు ఉన్న వారి శరీరంలో ద్రవాలు ఎక్కువగా పేరుకుపోతాయి. దీంతో వారి పాదాలు, చేతులు, మడమలు, కాళ్ల భాగాలు వాపులకు గురవుతాయి. కొందరికి ముఖం కూడా ఉబ్బిపోయి కనిపిస్తుంది. కళ్ల కింద కూడా వాపులు కనిపిస్తాయి. కిడ్నీలు డ్యామేజ్ అయ్యాయని చెప్పేందుకు ఇవి ప్రధానమైన సంకేతాలుగా భావించాలి. కిడ్నీ సమస్య ఉన్నవారికి నీరసం, అలసట ఉంటాయి. చిన్న పనిచేసినా విపరీతంగా అలసిపోతారు. వాతావరణం వెచ్చగా ఉన్నప్ పటికీ చేతులు, పాదాలు మాత్రం చల్లగా ఉంటాయి. శ్వాస తీసుకోవడంలో కూడా ఇబ్బందులు ఎదురవుతుంటాయి. కిడ్నీలు డ్యామేజ్ అయిన లేదా అవుతున్న వారిలో శరీరంలో టాక్సిన్లు అధిక మొత్తంలో ఉత్పత్తి అవుతాయి. చర్మం తరచూ దురదగా ఉంటుంది. పొడిబారి దురద పెడుతుంది. అలాగే ఆకలి లేకపోవడం, వికారం, వాంతికి వచ్చినట్లు ఉండడం ఇవన్నీ కిడ్నీ డ్యామేజ్‌కు సంకేతాలుగా అర్థం చేసుకోవాలి. ఈ లక్షణాలు అయినా కనిపిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవటం ద్వారా కిడ్నీలను కాపాడుకొనే అవకాశం కలుగుతుంది.

## ఇది పిచ్చి మొక్క కాదు.. వంద అనారోగ్య సమస్యలకు చెక్..!



మన చుట్టూ పరిసరాల్లో చాలా మొక్కలను చూస్తుంటాం. రకరకాల మొక్కలు పెరుగుతుంటాయి. వాటిలో ఔషధ గుణాలు కలిగిన మొక్కలు కూడా చాలానే ఉన్నాయని మనకు తెలియదు. వాటిని పిచ్చి మొక్కలుగా భావిస్తుంటాం. కానీ ఈ మొక్కల్లో వంద అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టేంత సామర్థ్యం ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. వాటిలో వాము మొక్క ప్రధానమైనది. ఇది పిచ్చి మొక్కలా కనిపిస్తుంటుంది.. కానీ ఈ మొక్క ఎన్నో ఔషధ గుణాలను కలిగి ఉంది. ఈ మొక్క అద్భుతమైన లాభాలను అందిస్తుంది. వాము మొక్క ఆకులను నీటిలో మరిగించి ఆ నీళ్లను తాగితే అనేక ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. వాము పలు వ్యాధులను నయం చేస్తుందని అంటున్నారు. అలాగే వాములోని థైమోల్ అనే సమ్మేళనం జీర్ణ ఎంజైమ్ ల ఉత్పత్తిని పెంచుతుది. తద్వారా ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా సహాయపడుతుందని నిపుణులు వివరిస్తున్నారు. అంతేకాక వాము గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం నుంచి ఉపశమనం కలిగిస్తుందని చెబుతున్నారు. %ూశ్రీంశీ =ఝఃు% "బెండ.. వీరి ఆరోగ్యానికి హానికరం" ఈ ఆకులను తీసుకోవడం ద్వారా వల్ల దగ్గు, జలుబు, ఇతర శ్వాస సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. గొంతు, ఊపిరితిత్తుల్లో ఉండే కఫం కరిగిపోతుందని వైద్యులు వివరిస్తున్నారు. ముక్కు దిబ్బడ నుంచి ఉపశమనంతో పాటుగా ఆస్తమా, బ్రాంకైటిస్ ఉన్నవారికీ మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఆయుర్వేదంలో వామును కడుపు ఉబ్బరం, అలసట, విరేచనాలు, పొత్తికడుపు నొప్పి, శ్వాసకోశ సమస్యలు, ఆకలి వేయకపోవడం వంటి వివిధ చికిత్సలకు ఉపయోగిస్తారని వైద్యులు వివరిస్తున్నారు. అలాగే వాము శరీరంలో ఉండే చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

# బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగవచ్చా..? తాగితే ఏం జరుగుతుంది..? ఎవరు తాగకూడదు..?



ప్రపంచ వ్యాప్తంగా అధిక శాతం మంది నిత్యం సేవిస్తున్న పానీయాల్లో కాఫీ మొదటి స్థానంలో ఉంటుంది. విదేశీయులు టీ కన్నా కాఫీని అధికంగా తాగుతారు. అయితే సాధారణ కాఫీ కాకుండా వారు బ్లాక్ కాఫీని ఎక్కువగా సేవిస్తుంటారు. బ్లాక్ కాఫీని సేవిస్తే అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలు ఉంటాయి. చక్కెర కలపకుండా కేవలం కాఫీ డికాషన్‌ను మాత్రమే తాగుతారు. దీన్నే బ్లాక్ కాఫీ అంటారు. కొందరు రుచి కోసం ఇందులో తేనె కలుపుకుంటారు. అయితే తేనె మాత్రమే కాదు, ఇందులో నిమ్మరసం కూడా కలుపుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగితే ఇంకా ఎక్కువ లాభం కలుగుతుందని వారు అంటున్నారు. ఇందులో తేనెను కూడా జోడించవచ్చు. దీంతో పోషకాలు, ఔషధ విలువల శాతం మరింత పెరుగుతుంది.

### గుండె ఆరోగ్యానికి..

బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి సేవిస్తే ఎంతో రుచిగా ఉంటుంది. అనేక ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందిస్తుంది. కాఫీ, నిమ్మరసంలో అనేక శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందువల్ల ఈ రెండింటినీ కలిపి తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. కాఫీలో క్లోరోజెనిక్ యాసిడ్ ఉంటుంది. నిమ్మరసంలో విటమిన్ సి, ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవన్నీ యాంటీ ఆక్సిడెంట్ల మాదిరిగా పనిచేస్తాయి. శరీరంలో ఏర్పడే ఫ్రీ ర్యాడికల్స్‌ను తొలగిస్తాయి. దీంతో అంతర్గతంగా వచ్చే వాపులు తగ్గిపోతాయి. గుండె కండరాలు, రక్త నాళాల వాపులు తగ్గుతాయి. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. క్యాన్సర్ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి.

### బరువు తగ్గేందుకు..

బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగితే బరువు తగ్గుతారని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. ఈ విధంగా తాగడం వల్ల శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా కొవ్వు కరుగుతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. ఆకలి నియంత్రణలో ఉంటుంది. ఆహారం తక్కువగా తింటారు. ఇది కూడా బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. నిమ్మరసం వల్ల శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. నిమ్మరసంలో ఉండే సిట్రిక్ యాసిడ్ జీర్ణ క్రియను మెరుగు పరుస్తుంది. ఆహారం సులభంగా జీర్ణం అయ్యేలా చేస్తుంది. మలబద్దకం తగ్గేలా చేస్తుంది. బ్లాక్ కాఫీలో కలిపే నిమ్మరసం కారణంగా అందులోని విటమిన్ సి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తుంది. దీంతో ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి. సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు వంటి సమస్యల నుంచి బయట పడవచ్చు. అలాగే మనం తినే ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది.

### జాగ్రత్తలు తప్పనిసరి..

బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి సేవించడం వల్ల అధిక బరువు సమస్యపై మ్యాజిక్ లా పనిచేస్తుందని చాలా మంది విశ్వసిస్తారు. అయితే ఇది నిజమే అయినప్పటికీ కేవలం బ్లాక్ కాఫీని సేవించడం వల్లే బరువు తగ్గుతామని, వ్యాయామం చేయాల్సిన పనిలేదని అనుకోవడం పొరపాటే అవుతుంది. ఎందుకంటే సరైన డైట్ ను పాటిస్తూ రోజూ బ్లాక్ కాఫీని నిమ్మరసంతో కలిపి సేవిస్తూ వ్యాయామం చేస్తుంటే బరువు త్వరగా తగ్గుతారు. ఫలితం త్వరగా వస్తుంది. ఇక బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలపాలా, వద్దా అని కూడా చాలా మంది సందేహిస్తుంటారు. ఇందులో ఆలోచించాల్సిన పనిలేదు. బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి తాగవచ్చు. దీని వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. అయితే అసిడిటీ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని తాగకూడదు. కాఫీ, నిమ్మరసం రెండూ ఆమ్ల స్వభావాన్ని కలిగి ఉంటాయి కనుక ఈ రెండింటినీ కలిపి తాగితే అసిడిటీ ఎక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. కనుక బ్లాక్ కాఫీలో నిమ్మరసం కలిపి సేవించేవారు ఈ జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. దీంతో ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు.

# మనో వికాసానికి





బాల సాహిత్యమే పునాదిమానవ జీవితానికి బాల్యం ఆధారభూతమైన దశ. ఈదశలో పిల్లల మనస్సు ఆకర్షణకు లోనవుతుంది, ఊహలకుగొప్ప స్థావరంగా ఉంటుంది. అలాంటి దశలో వారు చదివే, వినే, చూసే, అనుభవించే అంశాలే భవిష్యత్తు కాలంలో వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతాయి. పిల్లలు మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఎదగాలంటే ప్రేమ, ఆహారం, స్వచ్ఛమైన గాలి, ఆటలు ఎంత అవసరమో కళలు, కథలు, కవితలు, సంగీతం కూడా అంతే అవసరం. బాలసాహిత్యం అనేది పిల్లల కోసం రాసేది. అలా రాసిన బాల సాహిత్యం పిల్లల్లో తమదైన ఊహాశక్తి, జ్ఞానం, నైతిక విలువలు, సృజనాత్మకతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. కథలు, కవితలు, నాటికలు, జానపద గాథలు, ఇతర రూపాల్లో లభించే బాల సాహిత్యం పిల్లల మానసిక, భావోద్వేగ, సామాజిక అభివృద్ధికి దోహదపడుతుంది. నిజానికి బాల సాహిత్యం ఎదుగుతున్న పిల్లల జీవితాల్లో ఒక అమూల్యమైన సంపద. ఇది వారి మనసును ఆకర్షిస్తూ, విజ్ఞానాన్ని అందిస్తూ, నైతిక విలువలను నేర్పిస్తుంది. భవిష్యత్ సమాజంలో సానుకూల మార్పులు తీసుకురావడానికి బాల సాహిత్యం ఎంతో ముఖ్యమైనది. పిల్లలను ఉత్తమ తరంగా, పౌర సమాజంగా సంసిద్ధం చేయడానికి బాల సాహిత్యం ఒక శక్తివంతమైన సాధనం. దీన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా మనం పిల్లలకు మెరుగైన భవిష్యత్తును అందించవచ్చు. బాల సాహిత్యం చదువడం వల్ల పిల్లల్లో ఊహాశక్తి రెక్కలు కట్టుకొని ఎగురుతుంది. మాయాజాల కథలు, సాహస గాథలు వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తిస్తాయి. ఇవి వారి సృజనాత్మక ఆలోచనలను పెంచి, సమస్యలను వినూత్నంగా పరిష్కరించే సామర్థ్యాన్ని అందిస్తాయి.

బాల సాహిత్యం వివిధ రూపాల్లో ఉంటుంది. వాటిద్వారా వారిలో భాషా నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. సరళమైన, ఆకర్షణీయమైన శైలిలో రాసిన కథలు, కవితలు వారి పఠన, రచన, శ్రవణ సామర్థ్యాలను మెరుగుపరుస్తాయి. బాలసాహిత్యం పిల్లలకు సత్యం, ధర్మం, సహానుభూతి, సహకారం వంటి నైతిక విలువలను కూడా నేర్పుతుందనే చెప్పవచ్చు. అలనాటి పంచతంత్రం, ఈసప్ కథలు వంటివి నీతి బోధనల ద్వారా పిల్లల్లో సానుకూల దృక్పథాన్ని పెంపొందిస్తాయి. వేమన, సుమతి పద్యాలు వాళ్లలో సృజనాత్మకతకు పాదులు వేస్తాయి. అమ్మమ్మలు, నాన్నమ్మలు, తాతయ్యలు చెప్పే కథలు, జానపద కథలు పాటల ద్వారా పిల్లలు తమ సంస్కృతి, సంప్రదాయాల గురించి తెలుసుకుంటారు. ఇది వారిలో సాంస్కృతిక గౌరవాన్ని, గుర్తింపును కలిగిస్తుంది. బాలలు కథలు, కవితలు, పాటలు చదువడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం, ఓర్పు, పట్టుదల వంటి గుణాలు పెరుగుతాయి. బాల సాహిత్యం పిల్లల్లో సానుకూల వ్యక్తిత్వ లక్షణాలను రూపొందిస్తుంది. సమూహ కథలు, స్నేహగాథలు పిల్లలకు సహకారం, జట్టు కృషి, టీం స్పిరిట్ పక్కవారి భావాలను గౌరవించడం లాంటి అంశాలను నేర్పుతాయి. అంతేకాదు, సైన్స్ విజ్ఞాన సంబంధిత కథలు, కవితలు శాస్త్రీయ పిల్లల్లో జ్ఞానాభిరుచిని పెంచుతాయి. కథల ద్వారా పిల్లలు వివిధ భావోద్వేగాలను అర్థం చేసుకుంటారు. దుఃఖం, సంతోషం, భయం వంటి భావాలను నియంత్రించడం నేర్చుకుంటారు. బాల సాహిత్యం పిల్లలకు వినోదాన్ని అందిస్తూనే ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తుంది. ఇది వారి మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది.

ఇట్లా బాలల గురించి బాలల సాహిత్యం సినిమాలు సాంస్కృతిక రంగం గురించి చాలా మాట్లాడతాం. కానీ, మన దేశంలో పిల్లల కోసం చేస్తున్నదేమిటి? ఎంత? అని ఆలోచిస్తే జరుగుతున్నది చాలా స్వల్పమనే చెప్పాలి. ముఖ్యంగా పిల్లల సృజనాత్మక రంగంలో జరుగుతున్న కృషి చాలా తక్కువ. మలయాళం, బెంగాలీ, కన్నడ, కొంత మరాఠీ భాషల్లో మాత్రం ఎన్నదగిన కృషి జరుగుతున్నది. తెలుగులో బాల సాహిత్యం విరివిగానే వస్తున్నప్పటికీ ఇంకా నాణ్యమైన రచనలు రావాల్సి ఉన్నది. మరోవైపు బాల సాహిత్యకారులను ద్వితీయస్థాయి సృజనకారులుగా కాకుండా వారికి ఇవ్వాల్సిన గుర్తింపు ఇవ్వాల్సి ఉన్నది. సాహిత్య విషయాలు ఇట్లా ఉంటే సిన్మా సంగతి మరింత దారుణం. పిల్లల కోసం ప్రత్యేకంగా తీసిన వందల బాలల సినిమాలు ముంబై చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ గోదాముల్లో స్తబ్ధంగా పడి ఉన్నాయి. ఇక మన హైదరాబాద్‌లో జరగాల్సిన అంతర్జాతీయ స్థాయి పిల్లల సినిమాల పండుగకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తిలోదకాలిచ్చేశాయి. ఈ స్థితిలో బాల సాహిత్యకారులు మరో అంశాన్ని గమనించాల్సి ఉన్నది. ఇవ్వాళ ప్రాథమికోన్నత విద్యాసంస్థలన్నీ ఇంగ్లీష్ మాధ్యమానికే మొగ్గు చూపుతున్నాయి. భవిష్యత్తులో ఉద్యోగాల కోసమైనా, మరి దేనికోసమైనా ఇంగ్లిష్ తప్పనిసరి అనే వాదంతో తెలుగు బోధన అపురూపమైపోయిందనే చెప్పాలి. ఇక ఐటీ తదితర రంగాల్లో ఉన్నవాళ్లకు తెలుగు చదువడమే గగనమైపోయింది. అందుకే బాలసాహిత్య సృజనకర్తలు కేవలం తెలుగులోనే రాసి ఊరుకోకుండా వాటికి ఆంగ్లానువాదాలను కూడా జతచేసి ప్రచురించగలిగితే ఈ రోజుల్లోని ఇంగ్లిష్ మీడియం స్కూళ్లల్లో వాటికి సముచితమైన స్థానం లభిస్తుంది.

టీవీల్లో, ఇంటర్నెట్‌లో ఇంగ్లిషుకే అలవాటు పడిపోతున్న బాలలకు ద్విభాషా పుస్తకాలు ఎంతో మేలు చేస్తాయి. ఈ దిశలో పెద్దపల్లి లాంటి ఒక మారుమూల ప్రాంతంలో జరిగిన ఒక ప్రయత్నాన్ని అందరి దృష్టికి తేవాలని ఉన్నది. పుల్లూరి జగదీశ్వర్‌రావు అనే బాల సాహిత్యవేత్త 'లిటిల్స్' అనే ఒక కథల పుస్తకాన్ని తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో రాసి ప్రచురించారు ఆయన ప్రస్తుతం పెద్దపల్లి జిల్లాలో తహశీల్దార్‌గా పనిచేస్తున్నారు. విద్యాధికుడైన ఆయన పలు పత్రికల్లో కూడా వ్యాసాలు రాస్తారు. 'ఎడారి మొక్కలు' కథతో మొదలయ్యే ఈ కథా సంకలనంలో 24 కథలున్నాయి. అలతి అలతి మాటల్లో జీవకారుణ్యం, పర్యావరణం, జీవ వైవిధ్యం, కాలుష్యం వంటి అనేక అంశాలను కథలుగా ద్విభాషల్లో గుదిగుచ్చారు. ఈ కథలను చదివి పెద్దపల్లి జిల్లా కలెక్టర్ శ్రీహర్ష ఆకర్షితుడై 150 పేజీల 'లిటిల్స్' పుస్తకాన్ని తానే ముద్రించి పెద్దపల్లి జిల్లాలోని అన్ని ప్రభుత్వ స్కూళ్లకు పంపిణీ చేయించారు. కలెక్టర్ శ్రీహర్ష రాసిన ముందుమాటలో 'పాఠశాల విద్యను అభ్యసిస్తున్న కాలం బాలబాలికలకు అత్యంత ముఖ్యమైన కాలం. వాళ్లు వ్యక్తులుగా రూపొందే క్రమం అక్కడే మొదలవుతుంది' అన్నారు. అది ముమ్మాటికీ నిజం. పుల్లూరి జగదీశ్వర్‌రావు వలె పిల్లల కోసం ద్విభాషా కథలు, కవితలు రాయడం, కలెక్టర్ శ్రీహర్ష లాగా ప్రోత్సహించి స్కూలు విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడం రాష్ట్రమంతటా, అన్ని జిల్లాల్లోనూ జరగాల్సి ఉన్నది. అట్లయితేనే అర్థవంతమైన బాల సాహిత్యం అందుబాటులోకి వస్తుంది.

# అకస్మాత్తుగా కుంటుతున్నాడు..



మా బాబు వయసు మూడు సంవత్సరాలు. హుషారుగానే ఆడుకుంటాడు. ఇంతకుముందు ఎటువంటి ఆరోగ్య సమస్యలూ లేవు. అందరిలానే పరుగెత్తుతాడు, మాట్లాడతాడు. కానీ, వారం రోజులుగా తన నడకలో మార్పు కనిపిస్తున్నది. ఎందుకో కుంటుతున్నాడు. డాక్టర్‌కి చూపిస్తే.. నొప్పి ఉందని, కొన్ని నొప్పి తగ్గించే మందులు ఇచ్చారు. అవి వాడినా తగ్గలేదు. ఇప్పుడు ఏ వైద్యుడిని సంప్రదించాలి? మూడు సంవత్సరాల వయసు పిల్లలు చాలా హుషారుగా ఉంటారు. బాగా గెంతుతూ ఉంటారు. కుంటిగా నడవడం, నడకలో తేడా వచ్చిందంటే లోపల ఏదో సమస్య ఉండే ఉంటుంది. మీరు ఇప్పటికే వైద్యులకు చూపించామని చెబుతున్నారు. కానీ, ఏ డాక్టర్ అన్నది వివరించలేదు. పిల్లల వైద్యులతో తప్పని సరిగా చికిత్స చేయించాలి. ఎటువంటి గాయం లేకుండా, దెబ్బ కనిపించకుండా ఉన్నా.. పెద్దలు చూడనప్పుడు కిందపడి గాయపడవచ్చు. అవి కనిపించకపోవచ్చు. అందువల్ల నొప్పి, నడకలో మార్పు వస్తుంది. అలాంటి నొప్పి రెండు, మూడు రోజుల్లో సాధారణంగా తగ్గిపోవాలి. కొన్నిసార్లు జాయింట్స్ (కీళ్ల)లో, ఎముకలో, కండరాల్లో ఇన్‌ఫెక్షన్ ఉన్నా నొప్పి కలగడం, నడకలో మార్పు రావడానికి ఆస్కారం ఉంటుంది. ఆ ఇన్‌ఫెక్షన్ ఉంటే జ్వరం వస్తుంది. బిడ్డ హుషారుగా ఉండకపోవడం, రోజూ ఆడినట్టుగా ఆడకపోవడం జరుగుతుంది. కొన్నిసార్లు వారం, రెండు వారాలపాటు ఇన్‌ఫెక్షన్ ఉంటే కీళ్లలో నీరు చేరుతుంది. తుంటి ఎముక కీళ్లలో ఎక్కువగా ఈ సమస్య వస్తుంది. ఈ ఇబ్బంది దానికదే తగ్గిపోతుంది. కొద్దిగా నొప్పి, కుంటుతూ నడవడం కనిపిస్తాయి. ఏది ఏమైనా, పిల్లల డాక్టర్, కుదిరితే పిల్లల ఎముకల డాక్టర్‌కి చూపిస్తే మంచిది. అవసరమైన ఎక్స్‌రే, స్కాన్, రక్తపరీక్షలు చేయించాలి. ఆ తర్వాత వైద్యుల సలహాలు పాటించాలి.

# పశ్చిమాసియా ఉద్రిక్తతల ఎఫెక్ట్

**ఇండియా జీడీపీ వృద్ధిపై ప్రతికూల ప్రభావం**

**పశ్చిమాసియాలో యుద్ధం**

**ఆ ప్రభావం భారత జీడీపీ వృద్ధిపై పడే ఛాన్స్**

**వెల్లడించిన ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా**



పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థపై పడనుందని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. ఈ యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే 2027 ఆర్థిక సంవత్సరంలో భారత జీడీపీ వృద్ధిపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. దేశీయ డిమాండ్, పెట్టుబడి కార్యకలాపాలు మెరుగుపడటం, ప్రభుత్వ మూలధన వ్యయం కొనసాగడం ద్వారా భారత వాస్తవ జీడీపీ వృద్ధి 2027 ఆర్థిక సంవత్సరంలో దాదాపు 7.1 శాతంగా ఉంటుందని అంచనా వేసింది. 2026 ఆర్థిక సంవత్సరంలో తొలుత అంచనా వేసిన 7.6 శాతం కంటే కొంచెం తక్కువగా ఉంటుందని వెల్లడించింది. ఈ మేరకు తన నివేదికలో ఇక్రా పేర్కొంది.

**ఇక్రా నివేదిక ప్రకారం**

పశ్చిమాసియా ప్రాంతంలో దీర్ఘకాలిక భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ముడి చమురు ధరలను ప్రభావితం చేస్తాయి. భారత్‌కు పశ్చిమాసియా ముఖ్యమైన వాణిజ్య భాగస్వామిగా కొనసాగుతోంది. ఎగుమతులలో దాదాపు 14 శాతం, దిగుమతులలో దాదాపు 21 శాతం వాటా కలిగి ఉంది. దీని వల్ల మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్తతలు మరింత పెరిగితే భారత వాణిజ్యం దెబ్బతింటుంది. అలాగే భారత్‌కు ఇంధన సరఫరాలలో అంతరాయాలు ఏర్పడే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో యుద్ధం భారతదేశ వాణిజ్యానికి ఇబ్బంది కలిగిస్తుంది. ముఖ్యంగా సరకు రవాణా ఖర్చులు పెరుగుతాయి. ఇంధన సరఫరాలపై అనిశ్చితి నెలకొంటుంది.

**ఇక్రా నివేదికలో ఏముందంటే?**

ముడి చమురు బ్యారెల్ ధర 10 డాలర్లు పెరిగితే, అది దేశ కరెంట్ ఖాతా లోటును 0.30-0.40 శాతం పెంచవచ్చు. అదే విధంగా టోకు, వినియోగదారుల ధరల ద్రవ్యోల్బణాన్ని కూడా పెంచుతుంది. అధిక ఇంధన ఖర్చులు వినియోగ డిమాండ్‌ను తగ్గిస్తాయి. ఇది మొత్తం ఆర్థిక కార్యకలాపాలపై ప్రభావం చూపుతాయి. 2027 ఆర్థిక సంవత్సరంలో ముడి చమురు బ్యారెల్ ధర 70-75 డాలర్లు ఉంటే, ఇది కరెంట్ ఖాతా లోటును జీడీపీలో దాదాపు 1 శాతం వద్ద ఉంచుతుంది. అయితే, ముడి చమురు బ్యారెల్ ధర 100-105 డాలర్లకు పెరిగితే కరెంట్ ఖాతా లోటు జీడీపీలో దాదాపు 1.9-2.2 శాతానికి చేరవచ్చు. ఇది స్థూల ఆర్థిక ఒత్తిళ్లను పెంచుతుంది. భారత్‌కు విదేశాల నుంచి వచ్చే నిధులు (ఇన్‌వర్డ్ రెమిటెన్స్‌లో) దాదాపు 40 శాతం యూఏఈ, సౌదీ అరేబియాతో సహా పశ్చిమాసియా దేశాల నుంచే వస్తున్నాయని ఇక్రా పేర్కొంది.మరోవైపు, పశ్చిమాసియాలో యుద్ధం మరింత ముదురుతోంది. సోమవారం లెబనాన్‌లోని హెజ్‌బొల్లాకు చెందిన అల్ క్వార్డ్ అల్ హసన్ అసోసియేషన్ ఆస్తులు, ఆయుధ నిల్వ సౌకర్యాలపై ఐడీఎఫ్ వైమానిక దాడులు చేపట్టింది. హెజ్‌బొల్లా సైనిక సామర్థ్యాలను మరింత దెబ్బతియడానికి ఈ దాడులను చేసింది. అలాగే లెబనాన్ రాజధాని బీరూట్‌లో కచ్చితమైన దాడులు జరిపి లెబనాన్ కార్ప్స్‌లోని ఐదుగురు సీనియర్ కమాండర్లను హతమార్చింది. అమెరికాతో దౌత్య చర్చలు జరపమని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికాతో చర్చలు జరపడం అనే ప్రశ్న మరోసారి తలెత్తని పేర్కొంది. ఎందుకంటే అమెరికాతో చర్చలు తమకు చేదు అనుభవాన్ని మిగిల్చాయని వెల్లడించింది. ఈ మేరకు ఓ న్యూస్ ఛానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరఘ్చి పేర్కొన్నారు.మరోవైపు, పశ్చిమాసియా యుద్ధంపై కీలక వ్యాఖ్యలు చేశారు యూరోపియన్ యూనియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా. ఇప్పటివరకు ఈ యుద్ధంలో గెలిచిందెవరైనా ఉన్నారంటే అది రష్యా ఒక్కటేనని అభిప్రాయ పడ్డారు. యుద్ధం కారణంగా ఇంధన ధరలు పెరగడం రష్యాకు అనుకూలిస్తోందని తెలిపారు. అంతర్జాతీయ చట్టాలను అమెరికా సవాల్ చేస్తోందని, వీటిని పరిరక్షించాల్సిన బాధ్యత ఈయూపై ఉందని స్పష్టం చేశారు. ఈ అంశంపై చర్చించేందుకు పశ్చిమాసియాలో భాగస్వామ్య పక్షాలన్నీ ఏకతాటిపైకి రావాల్సి ఉందని చెప్పారు. బాంబుల ద్వారా స్వేచ్ఛ, మానవ హక్కులు సాధించలేమని అంతర్జాతీయ చట్టాల ద్వారానే ఇది సాధ్యం అవుతుందన్నారు.

# ఓటీటీల ఫిర్యాదు.. టెలిగ్రామ్‌కు కేంద్రం షాక్!


**పైరసీ కంటెంట్‌పై టెలిగ్రామ్‌కు కేంద్రం నోటీసులు**

**ఓటీటీల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన సమాచార శాఖ**

**3,142 పైరసీ ఛానెళ్లను గుర్తించిన అధికారులు**

**అశ్లీల కంటెంట్ కారణంగా ఇటీవల 5 ఓటీటీలపై నిషేధం**

**డిజిటల్ కంటెంట్‌పై నియంత్రణ పెంచుతున్న ప్రభుత్వం**




పైరసీ కంటెంట్‌ను అరికట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ప్రముఖ మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ టెలిగ్రామ్‌కు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ (వీ×దీ) తాజాగా నోటీసులు జారీ చేసింది. కాపీరైట్ ఉన్న సినిమాలు, వెబ్ సిరీస్‌లు తమ ప్లాట్‌ఫామ్‌పై విచ్చలవిడిగా షేర్ అవుతున్నాయని, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం-2000 కింద ఈ నోటీసులు ఇచ్చింది.జియో సినిమా, అమెజాన్ ప్రైమ్ వీడియో వంటి ప్రముఖ ఓటీటీ సంస్థలు తమ కంటెంట్‌ను అనుమతి లేకుండా టెలిగ్రామ్‌లో విస్తృతంగా పంచుతున్నారని ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. ఈ ఫిర్యాదులను పరిశీలించిన అధికారులు సుమారు 3,142 టెలిగ్రామ్ ఛానెళ్లలో పైరసీ కంటెంట్ పంపిణీ జరుగుతున్నట్లు గుర్తించారు. టెలిగ్రామ్‌లో పెద్ద సైజు ఫైల్స్ పంపే సౌలభ్యం, వినియోగదారుల వివరాలు గోప్యంగా ఉండటం వంటి ఫీచర్లను కొందరు పైరసీ కోసం దుర్వినియోగం చేస్తున్నట్లు తేలింది.ఇదిలా ఉంటే... అభ్యంతరకర, అశ్లీల కంటెంట్‌ను ప్రసారం చేస్తున్నాయన్న ఆరోపణలపై కేంద్రం ఇటీవల కఠినంగా వ్యవహరిస్తోంది. కొద్ది రోజుల క్రితమే మూడ్‌ఎక్స్‌వీఐపీ, కోయల్ ప్లేప్రో, డిజి మూవీప్లెక్స్ సహా ఐదు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను నిషేధించిన విషయం తెలిసిందే. గతంలో 2025 జులైలో కూడా ఇదే తరహా చర్యలు తీసుకున్నారు. అప్పట్లో ఆల్ట్, ఉల్లు, బిగ్‌షాట్స్ యాప్, దేశీఫ్లిక్స్ వంటి 25 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల వెబ్‌సైట్లు, యాప్‌లను బ్లాక్ చేయాలని ఆదేశించారు.ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తిత్వ మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా నైతిక నియమావళి) రూల్స్-2021 ప్రకారం.. ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు అశ్లీల, అసభ్యకరమైన, ఇతరుల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించే కంటెంట్‌ను ప్రచురించకూడదు. ఆన్‌లైన్ పైరసీని అరికట్టడంతో పాటు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లపై అభ్యంతరకర కంటెంట్‌ను నియంత్రించే విస్తృత ప్రయత్నాల్లో భాగంగానే ప్రభుత్వం ఈ తాజా చర్యలు తీసుకుంటోంది.

# ఆంత్రోపిక్‘ పేరుపై వివాదం.. అమెరికా ఏఐ దిగ్గజానికి కోర్టులో ఎదురుదెబ్బ

**‘ఆంత్రోపిక్‘ పేరుపై ట్రేడ్‌మార్క్ వివాదం**

**అమెరికా సంస్థతో పాటు భారత విభాగానికీ కోర్టు ఆదేశాలు**

**తాము వేరే సంస్థ అంటూ వాదించిన ఆంత్రోపిక్ ఇండియా**

**వాదనను తోసిపుచ్చి కేసులో చేర్చిన న్యాయస్థానం**




ఇకపై రెండు కంపెనీలు విచారణకు హాజరుకావాల్సిందేనన్న ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్ సంస్థ యజమాని

‘ఆంత్రోపిక్‘ పేరుపై నడుస్తున్న ట్రేడ్‌మార్క్ ఉల్లంఘన కేసులో ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సంస్థ ఆంత్రోపిక్ పీబీసీకి, దాని భారత అనుబంధ సంస్థ ఆంత్రోపిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కర్ణాటకలోని బెళగావి కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఇకపై ఈ రెండు కంపెనీలు కేసు విచారణకు హాజరుకావాల్సిందేనని ఆంత్రోపిక్ సాఫ్ట్‌వేర్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అయాజ్ ముల్లా మంగళవారం వెల్లడించారు. ఈ కేసును దాఖలు చేసింది ముల్లాకు చెందిన సంస్థే కావడం గమనార్హం.ఈ కేసుకు సంబంధించి మార్చి 9న జరిగిన విచారణ వివరాలను అయాజ్ ముల్లా ఐఏఎన్ఎస్‌తో పంచుకున్నారు. “గత విచారణలో మేము ఆంత్రోపిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సమన్లు జారీ చేశాం. మార్చి 9న వారు కోర్టు ముందు హాజరయ్యారు. అయితే, కేసులో ప్రతివాదిగా ఉన్నది అమెరికాకు చెందిన ఆంత్రోపిక్ పీబీసీ అని, తాము వేరే చట్టపరమైన సంస్థ అని ఆంత్రోపిక్ భారత అనుబంధ సంస్థ వాదించింది“ అని ముల్లా వివరించారు. ఈ వాదనతో కేసు నుంచి తప్పించుకోవాలని వారు ప్రయత్నించినట్లు ఆయన తెలిపారు.కేసు నమోదు చేసినప్పటి నేపథ్యాన్ని ముల్లా వివరిస్తూ, “మేము ఈ ఏడాది జనవరి ఆరంభంలో కేసు దాఖలు చేసినప్పుడు, ఆంత్రోపిక్ భారత అనుబంధ సంస్థ ఇంకా నమోదు కాలేదు. అందుకే మేము నేరుగా అమెరికా కంపెనీని ప్రతివాదిగా చేర్చాం. అయితే, ఆంత్రోపిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జనవరి చివరిలో రిజిస్టర్ అయింది“ అని అన్నారు. ఇప్పుడు ఆ సంస్థకు భారత్‌లో కార్యాలయం ఉన్నందున, సమన్లను స్థానిక చిరునామాకు పంపినట్లు తెలిపారు. అయితే, తాము సాంకేతికంగా వేర్వేరు కంపెనీలమని, కాబట్టి ఈ కేసు తమకు వర్తించదని భారత విభాగం ప్రతినిధులు వాదించారని ఆయన వెల్లడించారు.ఈ వాదనను తాము కోర్టులో వ్యతిరేకించామని ముల్లా చెప్పారు. “వారి వాదనను అడ్డుకుని, భారత అనుబంధ సంస్థను కూడా ఈ కేసులో చేర్చాలని (ఇంప్లీడ్) మేము కోరాం. మా అభ్యర్థనను కోర్టు అంగీకరించింది. దీంతో కేసును విజయవంతంగా కొనసాగించే అవకాశం మాకు లభించింది“ అని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇకపై జరగబోయే విచారణలకు అమెరికా మాతృసంస్థతో పాటు భారత అనుబంధ సంస్థ కూడా హాజరై సమాధానం చెప్పాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో పూర్తి భారతీయ సంస్థగా ఉన్న ఆంత్రోపిక్ సాఫ్ట్ వేర్ సంస్థ... అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఆంత్రోపిక్ తోనూ, దాని భారత అనుబంధ సంస్థతోనూ చేస్తున్న ఈ న్యాయపోరాటం ఆసక్తిని రేపుతోంది. ఆంత్రోపిక్ ట్రేడ్‌మార్క్ తమదేనని అయాజ్ ముల్లా చెబుతున్నారు. 2017 నుంచే తాము ఆంత్రోపిక్ అనే పేరును ఉపయోగిస్తున్నామని తెలిపారు.

# రోజంతా బ్యాటరీ... ఆపిల్ నుంచి కొత్త మ్యాక్‌బుక్


**ఏ18 ప్రో చిప్‌తో కొత్త మ్యాక్‌బుక్ నియోను లాంచ్ చేసిన ఆపిల్**

**ఏఐ పనుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ప్రాసెసర్**

**రూ. 69,900 ప్రారంభ ధరతో మార్కెట్లోకి విడుదల**

**16 గంటల బ్యాటరీ లైఫ్, 13-అంగుళాల లిక్విడ్ రెటినా డిస్‌ప్లే**

**నేటి నుంచి ప్రీ-ఆర్డర్లు, మార్చి 11 నుంచి అమ్మకాలు**



టెక్ దిగ్గజం ఆపిల్ తన ల్యాప్‌టాప్ శ్రేణిలో మరో కొత్త ఉత్పత్తిని మార్కెట్లోకి విడుదల చేసింది. ‘మ్యాక్‌బుక్ నియో‘ పేరుతో వచ్చిన ఈ సరికొత్త ల్యాప్‌టాప్‌ను బుధవారం లాంచ్ చేసింది. ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ఆధారిత పనులను వేగంగా చేసేందుకు వీలుగా శక్తిమంతమైన ఏ18 ప్రో చిప్‌ను ఇందులో అమర్చారు. 13 అంగుళాల లిక్విడ్ రెటినా డిస్‌ప్లే దీని ప్రధాన ఆకర్షణగా నిలుస్తోంది.ఒక్కసారి ఛార్జ్ చేస్తే 16 గంటల వరకు నిరంతరాయంగా రోజంతా పనిచేసే బ్యాటరీ లైఫ్‌ను ఈ మ్యాక్‌బుక్ నియో అందిస్తుంది. వీడియో కాల్స్ కోసం 1080జూ ఫేస్‌టైమ్ హెచ్‌డీ కెమెరా, స్పష్టమైన ఆడియో కోసం డ్యూయల్ మైక్స్, స్పేషియల్ ఆడియో సపోర్ట్‌తో డ్యూయల్ సైడ్-ఫైరింగ్ స్పీకర్లను పొందుపరిచారు. సౌకర్యవంతమైన టైపింగ్ కోసం మ్యాజిక్ కీబోర్డును, సులభమైన కంట్రోల్ కోసం పెద్ద మల్టీ-టచ్ ట్రాక్‌ప్యాడ్‌ను ఇచ్చారు.మ్యాక్‌బుక్ నియోను దృఢమైన అల్యూమినియం బాడీతో రూపొందించారు. ఇది బ్లష్, ఇండిగో, సిల్వర్, కొత్తగా సిట్రస్ రంగుల్లో అందుబాటులో ఉంటుంది. కేవలం 2.7 పౌండ్ల (సుమారు 1.22 కిలోలు) బరువుతో దీన్ని ఎక్కడికైనా సులభంగా తీసుకెళ్లవచ్చు.భారత్‌లో మ్యాక్‌బుక్ నియో ప్రారంభ ధర రూ. 69,900గా నిర్ణయించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూ. 59,900కే అందిస్తున్నారు. అమెరికాతో సహా 30 దేశాల్లో నేటి నుంచే ప్రీ-ఆర్డర్లు ప్రారంభమయ్యాయి. మార్చి 11 నుంచి ఆపిల్ స్టోర్లు, అధీకృత విక్రయ కేంద్రాల్లో ఇది అందుబాటులోకి వస్తుంది.“తక్కువ ధరలోనే మ్యాక్ అనుభూతిని అందించాలనే లక్ష్యంతో మ్యాక్‌బుక్ నియోను తీసుకొచ్చాం“ అని ఆపిల్ హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జాన్ టెర్నస్ తెలిపారు. “అద్భుతమైన డిజైన్, శక్తిమంతమైన పనితీరు, రోజంతా పనిచేసే బ్యాటరీతో ఇంతటి ల్యాప్‌టాప్‌ను కేవలం ఆపిల్ మాత్రమే తయారు చేయగలదు“ అని ఆయన వివరించారు.

# మెట్రో ప్రయాణికులకు గుడ్ న్యూస్.. ఫోన్‌పే ‘ఆల్-ఇన్-వన్‘ కార్డు వచ్చేసింది!

**కొత్త ఎన్‌సీఎంసీ కార్డు ఆవిష్కరించిన ఫోన్ పే**


**నెట్ లేకున్నా ఆఫ్‌లైన్‌లో ట్యాప్-అండ్-పే సదుపాయం**

**హైదరాబాద్ మెట్రో కౌంటర్లలో కార్డులు అందుబాటులో**

**దేశవ్యాప్తంగా బస్సులు, రైళ్లు, టోల్‌ప్లాజాల్లో చెల్లింపులు**

**గరిష్ఠంగా రూ.2,000 వరకు బ్యాలెన్స్**

**అన్ని ప్రయాణాలకు ఇక ఒకటే కార్డు**



హైదరాబాద్ మెట్రో ప్రయాణికుల కోసం ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే సరికొత్త ‘రూపే ఆన్-ది-గో‘ కార్డును అందుబాటులోకి తెచ్చింది. నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు (చీజవీజ) కింద పనిచేసే ఈ కార్డుతో రవాణా చెల్లింపులు మరింత సులభం కానున్నాయి. ముఖ్యంగా ఇంటర్నెట్ సౌకర్యం లేని చోట కూడా ఎటువంటి ఆటంకాలు లేకుండా ఆఫ్‌లైన్‌లోనే దీని ద్వారా పేమెంట్స్ చేయవచ్చు.

**ఎలా పొందాలి?**

ప్రయాణికులు తొలి దశలో హైదరాబాద్‌లోని మెట్రో టికెట్ కౌంటర్ల వద్ద ఈ కార్డును కొనుగోలు చేయవచ్చు

మీ ఫోన్ నంబర్‌కు వచ్చే ఓటీపీని ధ్రువీకరించాలి

మెట్రో ఏజెంట్ ద్వారా కార్డు తీసుకుని యూపీఐ, నగదు లేదా ఇతర కార్డుల ద్వారా డబ్బులు జమ చేసుకోవచ్చు

**ప్రత్యేకతలు ఇవే..**

ప్రీపెయిడ్ విధానం: ఈ కార్డులోని చిప్‌లోనే డబ్బు నిల్వ ఉంటుంది. కాబట్టి ఇంటర్నెట్ అవసరం లేకుండానే ‘ట్యాప్-అండ్-పే‘ పద్ధతిలో టికెట్ ఛార్జీలు చెల్లించవచ్చు.లావాదేవీల పరిమితి: కార్డులో గరిష్ఠంగా రూ.2,000 వరకు నిల్వ ఉంచుకోవచ్చు. ఆఫ్‌లైన్ ద్వారా ఒకేసారి గరిష్ఠంగా రూ.500 వరకు లావాదేవీలు జరపవచ్చు.ఒక్క కార్డు.. ఎన్నో ఉపయోగాలు: ఇది కేవలం హైదరాబాద్ మెట్రోకే పరిమితం కాదు. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి నగరాల్లోని మెట్రోలు, బస్సులు, రైళ్లు, టోల్ ప్లాజాలు, పార్కింగ్ కేంద్రాల్లో కూడా ఈ కార్డును వాడుకోవచ్చు. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా మరిన్ని రవాణా సంస్థలతో అనుసంధానం చేసి, ఈ సేవలను మరింత విస్తరిస్తామని ఫోన్‌పే పేమెంట్స్ హెడ్ దీప్ అగర్వాల్ వెల్లడించారు.

# గ్యాస్ సిలిండర్ల కొరత భయం

**హాట్ కేకుల్లా ఇండక్షన్ స్టవ్‌లు**

**ఆన్‌లైన్‌లో ‘అవుట్ ఆఫ్ స్టాక్‘ బోర్డులు!**

దేశవ్యాప్తంగా పలు నగరాల్లో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల లభ్యతపై ఆందోళనలు పెరగడంతో ఇండక్షన్ కుక్‌టాప్‌లకు డిమాండ్ ఒక్కసారిగా పెరిగింది. ప్రత్యామ్నాయ వంట మార్గంగా ప్రజలు ఇండక్షన్ స్టవ్‌ల కొనుగోలుకు ఎగబడుతుండటంతో ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో అవి ‘అవుట్ ఆఫ్ స్టాక్‘గా మారుతున్నాయి.ఎన్డీటీవీ కథనం ప్రకారం అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, బ్లింకిట్ వంటి ఆన్‌లైన్ సైట్లలో ఇండక్షన్ కుక్‌టాప్‌ల లభ్యత గణనీయంగా పడిపోయింది. బ్లింకిట్‌లో దాదాపు అన్ని మోడళ్లు స్టాక్ లేవని చూపిస్తుండగా, అమెజాన్‌లో కెంట్, ఉషా వంటి కొన్ని బ్రాండ్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఫ్లిప్‌కార్ట్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. చాలా మోడళ్లు ‘అవుట్ ఆఫ్ స్టాక్‘ బోర్డులతో దర్శనమిస్తున్నాయి.గత కొన్ని రోజులుగా ఇండక్షన్ కుక్‌టాప్‌ల అమ్మకాలు భారీగా పెరిగినట్లు రిటైలర్లు చెబుతున్నారు. పీటీఐ వార్తా సంస్థ ప్రకారం టాటా గ్రూప్‌కు చెందిన ఎలక్ట్రానిక్స్ రిటైలర్ ‘క్రోమా‘లో ఇండక్షన్ కుక్‌టాప్‌ల గిరాకీ మూడు రెట్లు పెరిగింది. ఈ విషయాన్ని ఇన్ఫినిటీ రిటైల్ లిమిటెడ్ సీఈవో శిబాషిష్ రాయ్ ధ్రువీకరించారు. అలాగే పిజియన్, గిల్మా వంటి బ్రాండ్లతో కిచెన్ ఉపకరణాలను విక్రయించే స్టవ్‌క్రాఫ్ట్ లిమిటెడ్ ఆన్‌లైన్ అమ్మకాలు నాలుగు రెట్లు పెరిగాయని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్ర గాంధీ తెలిపారు.దేశంలోని కొన్ని నగరాల్లో గ్యాస్ ఏజెన్సీల వద్ద సిలిండర్ల కోసం ప్రజలు బారులు తీరుతున్నారనే వార్తల నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. వాణిజ్య ఎల్‌పీజీ బుకింగ్‌లను పరిమితం చేసి, గృహ అవసరాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వడంతో ప్రజలు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు.

**ఎల్‌పీజీ కొరత లేదు: కేంద్ర ప్రభుత్వం**

అయితే, దేశంలో గృహావసరాలకు ఉపయోగించే ఎల్‌పీజీ సిలిండర్ల కొరత ఏమాత్రం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రజలు ఆందోళన చెందవద్దని సూచించింది. బుక్ చేసిన 2.5 రోజుల్లో సిలిండర్ డెలివరీ అవుతోందని పెట్రోలియం మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాతా శర్మ తెలిపారు. దేశానికి 70 శాతం ముడి చమురు సరఫరా హోర్ముజ్ జలసంధి బయటి మార్గాల నుంచే జరుగుతోందని, సరఫరాకు ఎలాంటి ముప్పు లేదని వివరించారు. ప్రభుత్వ చర్యల వల్ల ఎల్‌పీజీ ఉత్పత్తి 25 శాతం పెరిగిందని కూడా ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం భరోసా ఇస్తున్నప్పటికీ, వినియోగదారుల్లో నెలకొన్న ఆందోళనతో ఇండక్షన్ స్టవ్‌ల అమ్మకాలు మాత్రం జోరుగా



కొనసాగుతున్నాయి.



## వైష్ణవి చైతన్య కోలీవుడ్ ఎంట్రీ

టాలీవుడ్ సెన్సేషనల్ బ్యూటీ వైష్ణవి చైతన్య తన కెరీర్‌లో మరో బిగ్ స్టెప్ వేసింది. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ప్రయాణాన్ని మొదలుపెట్టి, 'బేబీ' సినిమాతో ఒక్కసారిగా టాలీవుడ్‌ను ఊపేసిన ఈ భామ, ఇప్పుడు కోలీవుడ్‌లో పాగా వేసేందుకు సిద్ధమైంది. తెలుగులో వరుస అవకాశాలతో దూసుకుపోతున్న వైష్ణవి, ఇప్పుడు ఏకంగా తమిళ స్టార్ హీరో ఆర్య సరసన నటించే బంపర్ ఆఫర్ కొట్టేసింది. తమిళ స్టార్ హీరో ఆర్య కెరీర్‌లో 40వ మైలురాయిగా తెరకెక్కుతున్న 'ఆర్య-40' చిత్రంలో వైష్ణవి చైతన్య హీరోయిన్‌గా చాన్స్ దక్కించుకుంది. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వెల్లడిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచింది. కేవలం ఆఫర్ దక్కించుకోవడమే కాదు, ఆ సినిమా కోసం అప్పుడే కష్టపడటం కూడా మొదలుపెట్టింది. జిమ్‌లో హీరో ఆర్యతో కలిసి వర్కవుట్స్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ, "ఆర్య-40 లోడింగ్.. పని జరుగుతోంది" అంటూ క్యాప్షన్ ఇచ్చింది. తెలుగులో ఫుల్ ఫేమ్ రాబట్టుకున్న వైష్ణవి ఇప్పుడు పక్క రాష్ట్రం తమిళనాడులో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది. ఆర్య వంటి మాస్ ఫాలోయింగ్ ఉన్న హీరోతో జోడీ కట్టడం వైష్ణవి కెరీర్‌కు పెద్ద ప్లస్ పాయింట్ అవుతుందని అభిమానులు భావిస్తున్నారు. వైష్ణవి షేర్ చేసిన జిమ్ ఫోటో ఇప్పుడు నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి. ఇక వాటిని చూసిన నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. "తెలుగులో ఎలాగైతే స్టార్‌గా ఎదిగావో, తమిళ ఇండస్ట్రీలో కూడా నెంబర్ వన్ ప్లేస్‌కు చేరుకోవాలి" అంటూ ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఫన్నీ మీమ్స్ షేర్ చేస్తూ నెట్టింట రచ్చ చేస్తున్నారు. మొత్తానికి వైష్ణవి చైతన్య తన క్రేజ్‌ను కోలీవుడ్ వరకు విస్తరించడం చూస్తుంటే, త్వరలోనే ఆమె సౌత్ ఇండియాలోనే బిజీ హీరోయిన్ అయ్యేలా కనిపిస్తోంది.




## మధుబాల బయోపిక్‌లో అనీత్ పడ్డా!

'సైయారా' చిత్రం బ్లాక్ బస్టర్ విజయంతో బాలీవుడ్‌లో ఒక్కసారిగా క్రేజీ బ్యూటీగా మారిపోయింది అనీత్ పడ్డా. అందం, నటనతో యూత్‌ను సైతం మెస్మరైజ్ చేస్తున్న ఈ అమ్మడు వరుస ఆఫర్లు అందుకున్నట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే ఓ స్టార్ నటి బయోపిక్‌లో నటించబోతున్నట్లు టాక్. దివంగత నటి మధుబాల బయోపిక్ తెరకెక్కబోతున్నట్లు గత కొద్ది రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. మొన్నటి వరకు ఈ బయోపిక్‌లో కియారా అద్వానీ నటిస్తున్నట్లు వార్తలు రాగా.. ఆమె నటించడం లేదని టీమ్ క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు ఈ బయోపిక్ క్రేజీ బ్యూటీ అనీత్ పడ్డా దగ్గరకు వెళ్లగా ఆమె ఓకే చెప్పిందట. అంతే కాకుండా.. ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే అనీత్ పడ్డా సైన్ కూడా చేసినట్లు బాలీవుడ్ మీడియా వర్గాల నుంచి సమాచారం. దీనికి సంబంధించి ఇతర వివరాలను గోప్యంగా ఉంచినట్లు తెలుస్తుండగా.. చిత్రీకరణ త్వరలో ప్రారంభమవుతుంది. తుది తారాగణాన్ని త్వరలో వెల్లడిస్తామని కూడా సమాచారం.

## సమ్మర్ స్పెషల్‌గా 'దీవాన'


శుభం సినిమాతో సక్సెస్ అందుకున్న యంగ్ టాలెంటెడ్ యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తుండగా.. ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ గీతా ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించింది. సమ్మర్‌లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు అనౌన్స్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు. ఇక ఫస్ట్ లుక్ నుంచే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన ఈ చిత్రం నుంచి ఇటీవల వాలెంటైన్స్ డే సందర్భంగా రిలీజ్ చేసిన స్టోరీ పోస్టర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఇంటెన్స్ లవ్ స్టోరీగా వస్తున్న 'దీవాన' హర్షిత్ రెడ్డి కెరీర్‌లో మరో గుర్తుండిపోయే సినిమా కానుందని హామీ ఇస్తున్నారు టీమ్. కాగా.. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్‌పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు.




## ఆమిర్ ఖాన్ తనయుడితో సాయి పల్లవి రొమాన్స్.. 'ఏక్ దిన్' ట్రైలర్ విడుదల

బాలీవుడ్ స్టార్ ఆమిర్ ఖాన్ తనయుడు జునైద్ ఖాన్ మరియు సౌత్ సెన్సేషన్ సాయి పల్లవి జంటగా నటించిన క్రేజీ చిత్రం 'ఏక్ దిన్'. ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. ఈ సినిమాకు సునీల్ పాండే దర్శకత్వం వహిస్తుండగా ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. హీరోయిన్ కేవలం ఒకే ఒక రోజు హీరోతో ప్రేమలో గడపాలనే ఆసక్తికరమైన కథాంశంతో ఈ సినిమా రాబోతుండగా.. ఈ చిత్రం ద్వారా సాయి పల్లవి హిందీ తెరకు పరిచయం కాబోతోంది. రామ్ సంపత్ సంగీతం, అరిజిత్ సింగ్ గాత్రం ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం మే 1, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేసేందుకు సిద్ధమవుతోంది






## ఎవరు అడ్డుపడినా చంపేస్తా.. ఆసక్తికరంగా 'వదలా' గ్లింప్స్!

జగపతి బాబు, లయ, హృతిక ప్రధానపాత్రల్లో నటించిన తాజా చిత్రం 'వదలా'. ఆకెళ్ల వి. కృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి తమ్మారెడ్డి భరద్వాజ్, కిశోర్ నాయుడు నిర్మాతలుగా వ్యవహరించారు. తాజాగా ఈ మూవీ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'నీ ఫ్యామిలీ నుంచి నేను ఒకరిని తీసేసుకుంటా.. ఎవరు అడ్డుపడినా చంపేస్తా' అంటూ ఓ లేడీ బ్లాక్ మెయిల్ చేస్తున్నట్లుగా గ్లింప్స్‌లో చూపించారు. మరి ఆ లేడి ఎవరు? ఎవరిని, ఎందుకు బ్లాక్ మెయిల్ చేస్తుంది అనేది తెలియాలంటే సినిమా చూల్సిందే. మొత్తంగా ఒక వ్యక్తి చుట్టూ తిరిగే కథగా ఇది రూపొందినట్లు గ్లింప్స్ చూస్తే అర్థమవుతుంది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.in epaper.vaarthasandhya.in. Cell : 73961 22101 , 99517 51662.